- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

బుధవారం
22-04-2026

సంపుటి : 01 సంచిక :31  పేజీలు : 08  వెల : ₹5/-  తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY తెలంగాణ. RNI NO : TGTEL/26/A0738 VOLUME : 01 ISSUE :31  NAMASTEY MAHAAPRABHA



Mr. NAKKA RAJU
Chairman of Namastey Mahaaprabha

## ప్రధాని మోడీ ఓ 'ఉగ్రవాది'

- వివాదం రేపిన ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలు
- ఆపై వివరణ ఇచ్చినా చల్లారని మాటల యుద్ధాలు
- 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడం సమాఖ్య స్ఫూర్తికి దక్కిన విజయమన్న ఖర్గే




**న్యూఢిల్లీ ఏప్రిల్ 21 (మహాప్రభ):**
ప్రధాని నరేంద్ర మోడీని ఉగ్రవాదిగా అభివర్ణిస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. అయితే దీనిపై వెంటనే స్పందించిన ఆయన, తాను ఆ ఉద్దేశంతో అనలేదని, ప్రధాని మోడీ ప్రజలను, రాజకీయ పార్టీలను భయాందోళనలకు గురిచేస్తున్నారనే అర్థంలో అన్నానని వివరణ ఇచ్చారు.
ఇంతకీ ఖర్గే ఏమన్నారంటే?
తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల కోసం డీఎంకేతో -మిగతా 3 లో

## సన్‌రైజర్స్ హ్యాట్రిక్ విక్టరీ

- భారీ టార్గెట్ ముందు బోల్తా కొట్టిన ఢిల్లీ..
- 243 స్కోర్ ఛేజింగ్‌లో ఢిల్లీ ఓటమి
- పాయింట్ల పట్టికలో పైకి ఎగబాకిన ఆరెంజ్ ఆర్మీ



**న్యూఢిల్లీ ఏప్రిల్ 21 (మహాప్రభ):**
ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫామ్‌లోకి వచ్చింది. వరుసగా మూడు మ్యాచ్‌లలో విజయం సాధించి, పాయింట్ల పట్టికలో దూసుకెళ్లింది. హోం గ్రౌండ్ ఉప్పల్ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించి హ్యాట్రిక్ విక్టరీతో విజయోత్సాహంలో మునిగిపోయింది. భారీ స్కోర్ ఛేజింగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ పోరాడిన్పటికీ ఓటమి తప్పలేదు. 47 పరుగుల మార్జిన్‌తో గెలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్ పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి ఎగబాకింది. ఉప్పల్ స్టేడియం వేదికగా జరిగిన ఈ -మిగతా 3 లో



## ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ప్రైవేట్ పరం చేసే యత్నాలను అడ్డుకుంటాం
- ప్రజలు సమస్యల్లో ఉంటే సభలతో కాలయాపనా
- 25న రాజకీయ శక్తిగా ముందుకు రాబోతున్నాం
- జాగృతి అధ్యక్షురాలు కవిత వెల్లడి

**హైదరాబాద్,ఏప్రిల్ 21 (మహాప్రభ):**
ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఆర్‌టిసి కార్మికులంటే లెక్కలేనితనంతో ప్రభుత్వం వ్యవహరిస్తోందని కవిత మండిపడ్డారు. ఆర్‌టిసిలో కార్మికులు లేకుండా చేసి సంస్థను ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఆర్‌టిసి కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. సమ్మెకు దిగిన ఆర్టిజన్లను బెదిరించి విధుల్లో చేరేలా ఒత్తిడి చేశారని అన్నారు. ప్రజలందరూ సమస్యల్లో ఉంటే అధికార, ప్రతిపక్షాలు రాజకీయాలు చేయడానికే ప్రాధాన్యత ఇస్తున్నాయని మండిపడ్డారు. కార్మికులంటే ఈ ప్రభుత్వానికి లెక్కలేదని అన్నారు. -మిగతా 3 లో

# బస్సులు బంద్

**ప్రభుత్వంతో కార్మిక సంఘాల చర్చలు విఫలం**

- సమ్మెలోకి 39 వేల మంది ఆర్టీసీ కార్మికులు
- హడావిడిగా ఐఏఎస్‌ల కమిటీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- జేఏసీని నాలుగు వారాల గడువు కోరిన కమిటీ
- తిరస్కరించిన ఆర్టీసీ కార్మిక సంఘాలు
- మా డిమాండ్లన్నీ పాతవేనని స్పష్టీకరణ
- నిలిచిపోనున్న 10వేల ఆర్టీసీ సర్వీసులు

**హైదరాబాద్ ఏప్రిల్ 21 (మహాప్రభ):**
తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ)లో సమ్మె సైరన్ మోగింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 53 రోజుల చారిత్రాత్మక సమ్మె తర్వాత సంస్థలోని కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా మరోసారి సమ్మెలోకి వెళ్లాయి. సమ్మెలోకి వెళ్తామని టీజీఎస్ఆర్టీసీ జేఏసీ నేతలు ముందుగానే కార్మిక శాఖ ద్వారా నోటీసు ఇచ్చి, ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అయినా ప్రభుత్వం సమ్మె నివారణకు ప్రత్యేకంగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సమ్మె అనివార్యమని నిర్ధారణ కావడంతో హడావిడిగా మంగళవారం మధ్యాహ్నం నాలుగు శాఖల ఐఏఎస్ అధికారులతో కమిటీని ఏర్పాటు చేస్తూ జీవో 66 విడుదల చేసింది. ఈ కమిటీలో ఐఏఎస్ అధికారులు వికాస్‌రాజ్, దానకిషోర్, -మిగతా 3 లో









## యువతకు ఏటా లక్ష ఉద్యోగాలు

- బెంగాల్ ఎన్నికల ప్రచార సభలో అమిత్ షా హామీ
- మేము రామమందిరం నిర్మిస్తే మమత సన్నిహితుడు బాబ్రీ మసీదు కడుతున్నారని ఆగ్రహం
- ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే ప్రతిభ ఆధారంగా ఉద్యోగ కల్పన
- సిఏఏ పౌర స్మృతిని అమలు చేస్తామని వెల్లడి

**కోల్ కతా ఏప్రిల్ 21 (మహాప్రభ):**
బెంగాల్ లో తాము అధికారంలోకి వస్తే ఏటా లక్ష ప్రభుత్వ ఉద్యోగాలను కల్పిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ ఇచ్చారు. మంగళవారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ మమత బెనర్జీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. "దీదీ ప్రభుత్వం కేవలం అవినీతికి, బంధుప్రీతికి కేరాఫ్ అడ్రస్ గా మారింది. రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయాయి. అర్హులైన అభ్యర్థుల నుంచి ఉద్యోగాలను లాక్కున్నారు" అని విమర్శించారు.
ప్రధానాంశాలు:
ఉద్యోగ కల్పన: బీజేపీ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే ఒక లక్ష ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని, -మిగతా 2 లో



## మళ్లీ అగాధంలో రూపాయి

- డాలర్‌తో 32 పైసలు పతనమై రూ.93.48లకు..

**ముంబయి ఏప్రిల్ 21 (మహాప్రభ):**
అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ వెలవెల పోతోంది. మంగళవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ 32 పైసలు క్షీణించి 93.48 వద్ద ముగిసింది. పశ్చిమాసియా శాంతి చర్చల పురోగతిపై నెలకొన్న అనిశ్చితి వల్ల ముడిచమురు ధరలు మళ్లీ పెరగడం. అదే సమయంలో అమెరికా కరెన్సీ బలంగా కొనసాగుతుండటం రూపాయిపై ఒత్తిడి పెంచిందని ఫారెక్స్ వర్గాలు తెలిపాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిసినప్పటికీ అవి రూపాయిని ఆదుకోలేకపోయాయని పేర్కొన్నాయి. వీటితో పాటు నాన్‌డెలివరబుల్ ఫార్వర్డ్ (ఎన్‌డీఎఫ్) మార్కెట్లలో స్పెక్యులేటివ్ బెట్టింగ్‌లపై ఉన్న ఆంక్షలను సడలిస్తూ రిజర్వ్ బ్యాంక్ -మిగతా 3 లో



## ఉద్యోగాల బదిలీలపై నిషేధం ఎత్తివేత

- ట్రాన్స్‌ఫర్లకు మే 1 నుంచి 31 వరకు అవకాశం...
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్ ఏప్రిల్ 21 (మహాప్రభ):**
ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీల ప్రక్రియ మే 1 నుంచి 31 వరకు కొనసాగుతుందని ప్రభుత్వం జీవోలో స్పష్టం చేసింది. జూన్ 1 నుంచి తిరిగి బదిలీలపై నిషేధం అమల్లోకి వస్తుందని పేర్కొంది. ఈ ఏడాది జనవరి 1 నాటికి ఒకే చోట మూడేండ్లు పూర్తి -మిగతా 3 లో

# సీజ్‌ఫైర్‌ను పొడిగించం!

**ఒప్పందానికి రాకపోతే బాంబుల మోతే..**



- ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక
- రెండో విడత చర్చలపై సందిగ్ధత
- బెదిరింపుల మధ్య చర్చలకు అంగీకరించం: ఇరాన్
- నేటితో ముగియనున్న గడువు

**వాషింగ్టన్ ఏప్రిల్ 21 (మహాప్రభ):**
ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం గడువు ముగిసే బుధవారంలోగా ఇరాన్ తమతో ఒక ఒప్పందానికి రాకపోతే ఆ దేశంపై బాంబుల వర్షం కురిపిస్తామని హెచ్చరించారు. అయితే పాక్‌లోని ఇస్లామాబాద్‌లో జరగాల్సిన రెండో విడత చర్చలపై సందిగ్ధత -మిగతా 3 లో



## రేపు తమిళనాడు, బెంగాల్ ఎన్నికలు

- తమిళనాడులో అన్ని స్థానాలకు బెంగాల్‌లో తొలి దశలో 152 సీట్లకు పోలింగ్

**కోల్‌కతా, చెన్నై: ఏప్రిల్ 21 (మహాప్రభ):**
తమిళనాడు ఒకే విడత ఎన్నికలకు, పశ్చిమ బెంగాల్ మొదటి దశ ఎన్నికలకు ప్రచారం మంగళవారం సాయంత్రం ఆరు గంటలతో ముగిసింది. తమిళనాడులోని మొత్తం 234 స్థానాలకు, బెంగాల్‌లో తొలి విడత 152 సీట్లకు ఈ నెల 23న జరిగే ఎన్నికలకు ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్టు అధికారులు ప్రకటించారు. పశ్చిమ బెంగాల్‌లో సర్, ప్రజల ఆహార అలవాట్లు కేంద్రంగా మొదటి విడత ప్రచారం ప్రధాన ప్రత్యర్థులైన అధికార టీఎంసీ, విపక్ష బీజేపీ మధ్య నువ్వా నేనా అన్నట్టుగా సాగింది. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు రెండు పార్టీలు పోటీపడి వాగ్దానాలు గుప్పించాయి. ఈ రాష్ట్రంలో వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ -మిగతా 3 లో

# కాంగ్రెస్‌కు ఓటెందుకెయ్యాలి?

**సకల జనులను దగా చేసినందుకా...**

- ఓటుకు నోటు కేసులో రేవంత్ జైలుకెళ్లడం ఖాయం
- కాళేశ్వరం, ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుల కోసమే ఢిల్లీకి వెళ్లా
- మాజీమంత్రి హరీశ్‌రావు



**హైదరాబాద్ ఏప్రిల్ 21 (మహాప్రభ):**
కాంగ్రెస్‌కు ప్రజలు మళ్లీ ఓటు ఎందుకు వేయాలని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను అమలు చేయనందుకా?, సకల జనులను దగా చేసినందుకా?, రాష్ట్రాన్ని స్కాములతో నింపినందుకు ఓటు వేయాలా? దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు సీనియర్ న్యాయవాదులను -మిగతా 3 లో

## స్మార్ట్‌గా ప్రీపెయిడ్ షాక్..

# స్మార్ట్ మీటర్లపై భారీ నిరసనలు

**-అనుమతి తీసుకోకుండానే విద్యుత్తు మీటర్లను పోస్ట్‌పెయిడ్ నుంచి ప్రీపెయిడ్‌కు మార్చుతున్న సర్కార్**
**-బ్యాలెన్స్ ఉన్నా సరఫరా నిలిపివేత**
**-బిల్లు వాచిపోతున్నదంటూ ఉత్తర ప్రదేశ్‌లో ప్రజల గగ్గోలు**



**లక్నో, ఏప్రిల్ 21 ( మహాప్రభ)**
ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా నగరంలో.. సోమవారం సాయంత్రం ఒక కాలనీలో చీకటి పడ్డాక విద్యుత్తు వెలుగుల్లో అందరూ పనులు చేసుకుంటుండగా.. ఆకస్మికంగా కరెంటు పోయింది. సాంకేతిక లోపం ఏర్పడిందేమో.. కొద్దిసేపట్లో కరెంటు వస్తుందని ఎదురుచూసిన వారికి నిరాశే ఎదురైంది. గంట గడిచినా విద్యుత్తును పునరుద్ధరించకపోవడంతో.. కొందరు స్థానిక సొసైటీ యాజమాన్యానికి ఫోన్ చేశారు. అప్పుడు తెలిసింది అసలు సంగతి.. 'మీ విద్యుత్తు మీటర్‌ను పోస్ట్‌పెయిడ్ నుంచి ప్రీపెయిడ్‌కు మార్చడం జరిగింది.మీరు గతంలో చెల్లించిన విద్యుత్తు చార్జీలో బ్యాలెన్స్ అయిపోయినందున మీకు సరఫరా నిలిపివేయడమైనది' అంటూ వారు సమాచారమందించారు. అప్పుడు మొదలైంది కాలనీవాసుల గగ్గోలు.. 'మాకు తెలియకుండా.. మా సమ్మతి లేకుండా మా మీటర్లను ప్రీపెయిడ్‌గా ఎందుకు మార్చారు?' అంటూ వారు అధికారులను నిలదీశారు.ఈ పరిస్థితి కేవలం నోయిడాలోనే కాకుండా ఉత్తరప్రదేశ్‌లోని అనేక జిల్లాల్లో నెలకొన్నది. తమకు తెలియకుండా మీటర్లను ప్రీపెయిడ్‌గా మార్చడమే కాకుండా.. తమకు గతంలో కంటే అధికంగా విద్యుత్తు బిల్లులు వస్తున్నాయంటూ వినియోగదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. తమ విద్యుత్తు యాప్‌లలో తగినంత బ్యాలెన్స్ ఉన్నప్పటికీ సరఫరా నిలిపివేస్తున్నారని, తరచుగా సాంకేతిక లోపాలు ఏర్పడుతున్నాయని నిరసన వ్యక్తంచేస్తున్నారు. జాలౌన్ గ్రామస్తులు మూకుమ్మడిగా తమ విద్యుత్తు మీటర్లను రోడ్డుపై పడేసి రాస్తారోకో చేపట్టారు. అలీగఢ్‌లో ఆగ్రహంతో ఊగిపోయిన మహిళలు ఓ విద్యుత్తు విభాగం అధికారిని తమ గ్రామం నుంచి తరిమికొట్టారని రెండు జాతీయ చానెళ్లు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన యూపీ విద్యుత్తు నియంత్రణ కమిషన్ తాజా పరిస్థితిపై పది రోజుల్లో నివేదిక ఇవ్వాలని విద్యుత్తు సరఫరా సంస్థ డిస్కమ్‌ను ఆదేశించింది.

**ఆదాయాన్ని పెంచుకొనేందుకు...**
విద్యుత్తు సరఫరాను ఆధునీకరించే క్రమంలో భాగంగా యూపీ ప్రభుత్వం ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను ప్రవేశపెట్టింది. వాణిజ్య నష్టాలను నివారించేందుకు, ఆదాయాన్ని పెంచుకొనే క్రమంలో భాగంగా ఈ విధానాన్ని అమలుచేస్తున్నది. రాష్ట్రంలో దాదాపు 3.5 కోట్ల మీటర్లను మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఇప్పటికే 78 లక్షల స్మార్ట్ మీటర్లు అమర్చినట్టు తెలుస్తున్నది. కేంద్రం ప్రవేశపెట్టిన 'నేషనల్ రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టర్ స్కీమ్ (ఆర్డీఎస్సెస్)'లో భాగంగా బీహార్, గుజరాత్ తదితర రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో స్మార్ట్ మీటర్లను వినియోగదారులకు అందజేస్తున్నారు.

**కరెంట్ బిల్లు చెల్లిస్తే.. అదే గిఫ్ట్!**
వేళాపాళా లేకుండా అధికారులు విద్యుత్తు కోత విధించడంతో యూపీలోని ఒక పెండ్లి వేడుక కాస్తా కలెక్టరేట్‌కు నిరసన ప్రదర్శనగా మారింది. బాండాలో మాటౌంధ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్న కుల్‌దీప్ పెండ్లి సందర్భంగా ఆదివారం రాత్రి నృత్య వేడుకలు నిర్వహిస్తుండగా కరెంట్ పోయింది. స్మార్ట్ మీటర్ నెగటివ్ బ్యాలెన్స్ వల్లే కరెంటు సరఫరా ఆగిపోయిందని తెలిసింది. సోమవారం వరుడు ఊరేగింపుగా కలెక్టర్ ఆఫీసుకు వెళ్లి నిరసన తెలిపాడు. స్మార్ట్‌మీటర్ల వల్ల రెట్టింపు బిల్లులు వస్తున్నాయని, దానిని సామాన్యులమైన తాము భరించలేక పోతున్నామని తెలిపాడు. తన పెండ్లి బహుమతిగా ఆ బిల్లును అధికారులే చెల్లించాలని డిమాండ్ చేశాడు. ఈ ఘటనపై జిల్లా మెజిస్ట్రేట్ విచారణకు ఆదేశించారు.

## ఈ వానకాలం ఎవుసం కష్టమే!.. పశ్చిమాసియా యుద్ధంతో ఎరువులకు కొరత

**మార్చిలో నాలుగోవంతు పడిపోయిన ఉత్పత్తి**
**సహజ వాయువు సరఫరాకు అంతరాయమే కారణం**
**తిండి గింజలపై ప్రభావం పడొచ్చు: నిపుణులు**



**హైదరాబాద్, ఏప్రిల్ 21 ( మహాప్రభ)**
ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను ఆగమాగం చేసిన పశ్చిమాసియా యుద్ధం ప్రభావం సాగు రంగం మీద కూడా పడింది. వ్యవసాయ దిగుబడికి కీలకమైన ఎరువుల ఉత్పత్తిపై పశ్చిమాసియా ఉద్రిక్తతలు తీవ్ర ప్రభావాన్ని చూపినట్టు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ ఘర్షణల కారణంగా మార్చిలో దేశీయంగా ఎరువుల తయారీ 24.6 శాతం మేర తగ్గినట్టు సోమవారం వెల్లడించింది. ఎరువుల కొరత ఏర్పడితే వానకాలం పంటపై ప్రభావం పడొచ్చని, ఇది ఆహార సంక్షోభానికి దారి తీయొచ్చని నిపుణులు ఆందోళన వ్యక్తం

**అసలేం జరిగింది?**
ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులకు పాల్పడటంతో పశ్చిమాసియాలో యుద్ధం మొదలైంది. అమెరికా-ఇజ్రాయెల్ దాడులకు నిరసనగా గల్ఫ్ దేశాల్లోని చమురు క్షేత్రాలపై దాడులకు దిగడమే కాకుండా ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన హొర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేసింది. దీంతో ఇంధన సరఫరాపై తీవ్ర ప్రభావం పడింది. యూరియా వంటి ఎరువుల తయారీకి సహజవాయువు కీలకం. అయితే, హొర్ముజ్‌ను మూసేయడంతో సహజవాయువును రవాణా చేసే ట్యాంక ర్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో దేశీయంగా ఎరువుల తయారీ మందగించింది.

## త్వరలో ఈ-85!.. పెట్రోల్ స్థానంలో ఇథనాల్

**ప్రవేశపెట్టడానికి కేంద్రం ఏర్పాట్లుత్వరలోనే ముసాయిదా నిబంధనలు**
**రెండేండ్లలో అమలు చేసే అవకాశం**




**న్యూఢిల్లీ: ఏప్రిల్ 21 ( మహాప్రభ)**
దేశంలో త్వరలోనే పెట్రోల్, డీజిల్ కనుమరుగై ఆల్కహాల్ ఇంధనం అమల్లోకి రానుందా? దీనిపై కేంద్ర స్థాయిలో విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయా? అంటే అవుననే సమాధానం వస్తుంది. దేశంలో పెట్రోల్‌కు ప్రత్యామ్నాయం తీసుకురావాలని కేంద్రం భావిస్తున్నది. ఈ మేరకు చకచకా ఏర్పాట్లు చేస్తున్నది. కొత్త విధానం కనుక అమలైతే త్వరలోనే కార్లు, ఇతర వాహనాలు ఆల్కహాల్ ఇంధనంపై నడుస్తాయి. పెట్రోల్‌లో 20 శాతం ఉండే ఈ-20 ఇథనాల్‌కు స్వస్తి పలికే అవకాశం ఉంది. పశ్చిమాసియాలో యుద్ధంతో అంతర్జాతీయంగా ఇంధన కొరత ఏర్పడిన క్రమంలో దాని దుష్ప్రభావాలను భారత్ సైతం ఎదుర్కొంది. ఇకపై భారత్ ఎక్కువగా ఎగుమతులపై ఆధారపడకూడదని భావించి ప్రత్యామ్నాయ ఇంధనాలపై దృష్టి పెట్టింది.అందులో భాగంగా, త్వరలోనే ఆల్కహాల్‌తో కూడిన ఇంధనాన్ని ప్రవేశపెట్టాలని యోచిస్తున్నది. దీని కోసం 85 శాతం ఇథనాల్, 15 శాతం పెట్రోల్ మిశ్రమంతో కూడిన ఈ-85ను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి ప్రభుత్వం ముసాయిదా నిబంధనలను జారీ చేయడానికి సిద్ధపడుతున్నట్టు సమాచారం. పెట్రోల్ సంక్షోభం నుంచి గట్టెక్కడానికి ఇదే మంచి ప్రత్యామ్నాయమని భారత్ భావిస్తున్నది. 2016లోనే రూపొందిన ఈ ప్రణాళిక త్వరలోనే అమలులోకి తెచ్చే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇథనాల్ 85 (ఈ-85)కు సంబంధించిన ముసాయిదా నిబంధనలను ప్రభుత్వం త్వరలోనే విడుదల చేస్తుంది. ప్రాథమిక పరీక్షలు కూడా నిర్వహించారని పేరు చెప్పడానికి నిరాకరించిన ఒక అధికారి వెల్లడించారు. ఈ-85 లేదా ఫ్లెక్స్ ఫ్యూయల్ కోసం ఇంజిన్‌లో కొన్ని మార్పులు చేయాల్సి ఉంటుంది. దీని విడుదల రెండు సంవత్సరాలలో జరుగుతుందని అంచనా.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి


**-భారతీయ కిసాన్ సంఘ్ డిమాండ్**




**తాడ్వాయి, ఏప్రిల్ 21(మహాప్రభ)**
మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలని భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కామారెడ్డి--ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై రైతులు రాస్తారోకో నిర్వహించారు. దీంతో కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి. రైతులు మాట్లాడుతూ, ఇప్పటికే పంట కోత పూర్తయినప్పటికీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధరలకు కొనుగోలు చేస్తుండటంతో నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా సరఫరాలో అమలు చేస్తున్న ఓటీపీ విధానం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, చాలా మందికి సకాలంలో ఎరువు అందడం లేదని పేర్కొన్నారు. ఈ విధానాన్ని సవరించి రైతులకు సులభంగా ఎరువు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాల్లో హమాలీ డబ్బుల పేరిట అవినీతి జరుగుతోందని ఆరోపించారు. సంబంధిత అధికారులపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేదంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు..13 మంది మృతి..

**- కేరళలోని త్రిస్సూర్‌లో ఘటన**



**త్రిస్సూర్: ఏప్రిల్ 21 ( మహాప్రభ)**
కేరళలోని సెంట్రల్ త్రిస్సూర్ జిల్లా ముండతికోడ్‌లో మంగళవారం భారీ పేలుడు సంభవించింది. ఓ బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన ఈ దుర్ఘటనలో 13 మంది మృతిచెందగా... గాయపడిన పలువురి పరిస్థితి విషమంగా ఉన్నది. ఘటన సమయంలో 40 మంది అక్కడ ఉన్నారని అధికారులు భావిస్తున్నారు. త్రిస్సూర్ పూరం పర్వదినం కోసం ఒక ఆలయానికి అవసరమైన బాణసంచాను తాత్కాలిక షెడ్‌లో తయారు చేస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది.పేలుళ్ల శబ్దం కిలోమీటర్ల మేర వినిపించిందని.. ఈ ప్రమాదంలో చుట్టు పక్కల ఇండ్లు దెబ్బ తిన్నాయని స్థానికులు తెలిపారు. పేలుళ్లు ఇంకా కొనసాగుతుండటంతో సహాయక చర్యలకు అంతరాయం ఏర్పడింది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉం డటం ప్రమాదానికి ఒక కారణమై ఉండొచ్చని భావిస్తున్నారు. గాయపడిన వారిని దవాఖానకు తరలించడంలో స్థానికులు సహాయ పడ్డారు. ఖాళీగా ఉన్న వ్యవసాయ పొలాల్లో ఇటీవల తాత్కాలిక బాణసంచా తయారీ యూనిట్లను నెలకొల్పుతున్నట్టు అధికారులు గుర్తించారు.

## కేదార్‌నాథ్ ఆలయంలో మొబైల్ ఫోన్లపై నిషేధం



**కేదార్‌నాథ్:ఏప్రిల్ 21 ( మహాప్రభ)**
కేదార్‌నాథ్ పవిత్రతను సంరక్షించేందుకు ఆలయ ప్రాంగణంలో మొబైల్ ఫోన్ల వాడకంపై నిషేధం విధించినట్టు ఆలయ అధికారులు మంగళవారం తెలిపారు. ఆలయం లోపలికి ఫోన్లు తీసుకురావడం, ఫొటోలు తీయడం, వీడియోలు, రీల్స్ రికార్డ్ చేయడంపై నిషేధం విధించారు.గుడిలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించడానికి, యాత్రికులకు సజావుగా దర్శనం కలుగడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆలయ కమిటీ సభ్యుడు వినీత్ పొస్తి తెలిపారు.

## మళ్లీ అట్టుడుకుతున్న మణిపూర్.. రెండు సంఘాల బంద్ పిలుపుతో ఉద్రిక్తతలు



**మణిపూర్ ఏప్రిల్ 21 ( మహాప్రభ)**
(Manipur) లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల జరిగిన వేర్వేరు ఘటనలకు నిరసనగా రెండు ప్రధాన సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. బంద్‌లతో సోమవారం రాష్ట్రంలోని లోయ, కొండ ప్రాంతాల్లో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. విద్యాసంస్థలు, మార్కెట్‌లు, ప్రజా రవాణా సేవలు నిలిచిపోయాయి. ఇంఫాల్ లోయ (×ఎజూష్ఘుశ్రీ ఖుశ్రీశ్రీవఎ) లోని పలు ప్రాంతాల్లో నిరసనకారులు ధర్నాలు నిర్వహించారు. బిష్ణుపూర్ జిల్లా (దీఅంష్త్రఅబజూబతీ ఎఱర్‌తీఱష్‌) లో ఏప్రిల్ 7న జరిగిన బాంబు పేలుడు ఘటనలో నిద్రలో వున్న ఐదేళ్ల బాలుడు, ఆరు నెలల చిన్నారి ప్రాణాలు కోల్పోయారు.ఈ ఘటనకు నిరసనగా మహిళా సంఘం 'మైరా పైబీలు' ఐదు రోజుల ఆందోళనకు పిలుపునిచ్చింది. ఆ నిరసనల సందర్భంగా సీఆర్పీఎఫ్ క్యాంపుపై కొందరు దాడి చేయగా, భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో ముగ్గురు పౌరులు మరణించారు. మరోవైపు ఏప్రిల్ 18న ఉఖ్రుల్ జిల్లాలో పౌరుల కాన్వాయ్‌పై మిలిటెంట్లు జరిపిన దాడిలో మాజీ సైనికోద్యోగి సహా ఇద్దరు మృతిచెందారు. దానికి నిరసనగా యునైటెడ్ నాగ కౌన్సిల్ (UNC) కొండ ప్రాంతాల్లో మూడు రోజుల సంపూర్ణ బంద్‌కు పిలుపునిచ్చింది. ఆ రెండు ఘటనలతో రాష్ట్రంలో తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.
ఈ హింసాత్మక ఘటనలపై న్యాయవాదులు కూడా నిరసన తెలిపారు. బాధ్యులను పట్టుకోవడానికి కూంబింగ్ ఆపరేషన్‌లు ముమ్మరం చేయాలని, కాల్పుల ఘటనపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ రెండు కేసులను జాతీయ దర్యాప్తు సంస్థ (NIA) కు అప్పగించింది. శాంతిభద్రతల పునరుద్ధరణలో కేంద్రం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. తక్షణమే చర్యలు చేపట్టి బాధితులకు ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేసింది.

## తమిళనాడును తలవంచనివ్వను

**- లౌకిక ప్రగతిశీల కూటమికి ఓటు వేయండి!**
**-- ఎంకె స్టాలిన్**




**చెన్నై ఏప్రిల్ 21 ( మహాప్రభ)**
తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ మంగళవారం తన సోషల్ మీడియా ఖాతా ద్వారా ఆయన ఓటర్లను ఉద్దేశించి, తమ ప్రజాస్వామ్య కర్తవ్యాన్ని నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. గత ఐదేళ్లుగా తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించానని, అన్ని రంగాలలో తమిళనాడును నంబర్ వన్ రాష్ట్రంగా నిలబెట్టానని స్టాలిన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్టాలిన్, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. "దాస్యం అంటే ఏమిటి, ధైర్యం అంటే ఏమిటి? నటన అంటే ఏమిటి, కష్టపడి పని చేయడం అంటే ఏమిటి?" అని ప్రశ్నిస్తూ, ప్రజలు ఈ విషయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. లౌకిక ప్రగతిశీల కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ఈ ఎన్నికలు తమిళనాడు భవిష్యత్తును నిర్ణయిస్తాయని, రాష్ట్ర గౌరవాన్ని కాపాడటానికి లౌకిక ప్రగతిశీల కూటమికి ఓటు వేయడం అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు.

# సన్‌రైజర్స్ హ్యాట్రిక్ విక్టరీ

మొదటి తరువాయి

మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ బౌలింగ్ ఎంచుకుంది. ఆరెంజ్ ఆర్మీ ఓపెనర్ అభిషేక్ శర్మ తన మార్క్ బ్యాటింగ్‌తో మరోసారి విరుచుకుపడ్డాడు. 47 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్న అభిషేక్ 135 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఆఖర్లో క్లాసెన్ అదరగొట్టడంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు 20 ఓవర్లలో 242/2 స్కోర్ చేసింది.భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఆరంభంలోనే ఓపెనర్ పాతూమ్ నిస్సాంక వికెట్ కోల్పోయింది. 21 పరుగులకే తొలి వికెట్ కోల్పోయినా ఫస్ట్ డౌన్‌లో వచ్చిన నితీష్ రాణా సన్‌రైజర్స్ బౌలర్లను చెడుగుడు ఆడుకున్నాడు. ఒకానొక దశలో డేంజరస్‌గ్గ కనిపించిన ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఈషాన్ మలింగ దెబ్బ కొట్టాడు.ల్లీ స్కోర్ 107 పరుగుల వద్ద కేఎల్ రాహుల్‌ను షాకీబ్ హుస్సేన్ అవుట్ చేయగా.. ఆ తర్వాత ఓవర్‌లోనే నితీష్ రాణా, డేవిడ్ మిల్లర్లను ఇషాన్ మలింగ వెంటవెంటనే అవుట్ చేశాడు. దాంతో 107 పరుగులకే ఢిల్లీ నాలుగు వికెట్లు కోల్పోయింది. ఒకవైపు వికెట్లు పడుతున్నా మరోవైపు ఢిల్లీ బ్యాటర్లు బౌండరీలు బాదుతూనే ఉన్నారు.ట్రిస్టన్ స్టబ్స్ – సమీర్ రిజ్వీ కలిసి ఐదో వికెట్‌కు 59 పరుగులు జోడించారు. ఈ ఇద్దరూ 33 బంతులు ఆడగా స్టబ్స్ 27, రిజ్వీ 32 పరుగులు బాదారు. ఈ డేంజరస్ పార్ట్‌నర్‌షిప్‌ను మళ్లీ ఇషాన్ మలింగానే బ్రేక్ చేశాడు. వరుస బౌండరీలు బాదుతున్న స్టబ్స్ 16 బంతుల్లో 27 పరుగులు చేసి అవుటయ్యాడు. దాంతో ఢిల్లీ 166 పరుగులకు ఐదు వికెట్లు కోల్పోయింది. అశుతోష్ 14, అక్షర్ 2, సమీర్ రిజ్వీ 41 పరుగులు చేసి అవుటయ్యారు. ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసింది. దాంతో సన్‌రైజర్స్ 47 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఇషాన్ మలింగ నాలుగు ఓవర్లు వేసి 32 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు తీసి ఆకట్టుకోగా.. హర్ష్ దూబే 2 ఓవర్లలో మూడు వికెట్లు పడగొట్టాడు.

# ప్రధాని మోడీ ఓ 'ఉగ్రవాది'

మొదటి తరువాయి

ఏఐఏడీఎంకే పొత్తు పెట్టుకోవడాన్ని ప్రశ్నిస్తూ ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. "అన్నాదురై ఫోటో పెట్టుకుని ఏఐఏడీఎంకే వారు మోడీతో ఎలా కలుస్తారు? ఆయన ఒక ఉగ్రవాది. ఆయన పార్టీకి సిద్ధాంతం, న్యాయంపై నమ్మకం లేదు. అంతా టియర్ (భయం) పేరుతో కలవడం అంటే ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడమే. అన్నాదురై, కామరాజ్, పెరియార్, కరుణానిధి, బాబాసాహెబ్ అంబేద్కర్ సిద్ధాంతాలను నీరుగారుస్తున్నారు." అని అన్నారు.

బీజేపీ స్పందన:

ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందించారు. ఒక జాతీయ పార్టీకి అధ్యక్షుడిగా ఉండి, దేశ ప్రధానిని ఉగ్రవాది అనడం ఖర్గే విచక్షణకే వదిలేస్తున్నామని, ఇది ఆయన దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు.

మహిళా రిజర్వేషన్లు:

మరోవైపు మహిళా రిజర్వేషన్ల కోసం నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)తో ముడిపెట్టడం ద్వారా బీజేపీ ఒక ప్రమాదకరమైన ఆట ఆడుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. లోక్ సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడాన్ని ఆయన స్వాగతించారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగితే, జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు

# యువతకు ఏటా లక్ష ఉద్యోగాలు

మొదటి తరువాయి

ఐదేళ్లలో మొత్తం 5 లక్షల ఉద్యోగాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు.
అవినీతి రహిత పాలన: ఉద్యోగాల కల్పనలో ఎలాంటి పైరవీలకు తావులేకుండా కేవలం ప్రతిభ ఆధారంగానే నియామకాలు జరుగుతాయని స్పష్టం చేశారు.

రామమందిరం – బాబ్రీ మసీదు: అయోధ్యలో తాము రామమందిరాన్ని నిర్మిస్తుంటే, మమత బెనర్జీ సన్నిహితుడైన ఒక నేత బాబ్రీ మసీదును నిర్మిస్తామని అంటున్నారని, ఇలాంటి వ్యక్తులకు ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు.సిఏఏ అమలు: బెంగాల్ లో పౌరసత్వ సవరణ చట్టాన్ని కచ్చితంగా అమలు చేస్తామని, శరణార్థులకు పౌరసత్వం కల్పిస్తామని అమిత్ షా పునరుద్ఘాటించారు.

# ఉద్యోగాల బదిలీలపై నిషేధం ఎత్తివేత

మొదటి తరువాయి

చేసుకున్న ఉద్యోగులు బదిలీకి అర్హులు. అయితే నాలుగేండ్లు పూర్తి చేసుకున్న వారు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. 2027 మే 31కి ముందు ఉద్యోగ విరమణ చేయనున్న ఉద్యోగులకు దీన్నుంచి మినహాయింపు ఉంటుంది. వీరు బదిలీని కోరుకునే అవకాశం వారికే కల్పిస్తారు. జీవిత భాగస్వామి ఆధారంగా కోరుకునే బదిలీలకు మూడేండ్ల నిబంధన వర్తించదని జీవోలో స్పష్టం చేశారు. ఏ ఒక్క క్యాడర్‌లో కూడా 40శాతం కంటే ఎక్కువ మంది ఉద్యోగులను బదిలీ చేయకూడదు. బదిలీల ప్రక్రియ మొత్తం కౌన్సెలింగ్ పద్ధతిలో సాధ్యమైనంత వరకు ఆన్‌లైన్/వెబ్ ఆధారిత అప్లికేషన్ ద్వారా పారదర్శకంగా జరగాలని ప్రభుత్వం ఆదేశించింది. అలాగే బదిలీల సమయం లో భార్యాభర్తలు (ఒకరికి మాత్రమే), ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్నవారు, 70 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారు, మానసిక వికలాం గులైన పిల్లలున్న తల్లిదండ్రులు, వితంతువులు, క్యాన్సర్, న్యూరో సర్జరీ, కిడ్నీమార్పిడి, లివర్ మార్పిడి, ఓపెన్ హార్ట్ సర్జరీ, బోన్ టీబీ వంటి వైద్య అవసరాలు కలిగిన వారికి ప్రాధాన్యతనిస్తారు. అయితే నిబంధనలను ఉల్లంఘిస్తే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. సెన్సస్ (జనాభా గణన) సంబంధిత పనుల్లో ఉన్న ఉద్యోగులకు ఈ నిబంధనలు వర్తించబోవని స్పష్టం చేసింది. బదిలీల ప్రక్రియను పర్యవేక్షిం చడానికి క్యాడర్ వారీగా ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం జీవోలో స్పష్టం చేసింది. స్టేట్, మల్టీ-జోనల్/జోనల్, జిల్లా స్థాయిల్లో అధికారుల నేతత్వంలో ఈ కమిటీలు పని చేయనున్నాయి.

# రేపు తమిళనాడు, బెంగాల్ ఎన్నికలు

మొదటి తరువాయి

కూడా రంగంలో ఉన్నప్పటికీ ప్రధాన పోటీ టీఎంసీ–బీజేపీ మధ్యే జరుగుతున్నది. మొదటి విడతలో 3.60 కోట్ల మంది ప్రజలు ఓటును వినియోగించుకోనున్నారని ఎన్నికల సంఘం తెలిపింది. ఎన్నికల సందర్భంగా రికార్డు స్థాయిలో 2,450 కంపెనీల కేంద్ర పారామిలిటరీ బలగాలకు చెందిన 2.5 లక్షల మందిని మోహరించారు. వరుసగా నాలుగోసారి అధికారం చేపట్టాలని మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ఆశపడుతున్నది. అయితే ఆమెను ఎలాగైనా గద్దెదించి తొలిసారిగా బెంగాల్ పీఠం ఎక్కాలని బీజేపీ ఉవ్విళ్లూరుతున్నది. ఇటీవల 'సర్' పేరిట రాష్ట్రంలో 91 లక్ష ఓట్ల తొలగింపుపై ఆ పార్టీ ఆశలు పెట్టుకుంది. యూనిఫామ్ సివిల్ కోడ్‌ను అమలు చేస్తామని, చొరబాట్లను అడ్డుకుంటామని, ఉద్యోగాలు కల్పిస్తామని, సరిహద్దులను పటిష్టం చేస్తామని, ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ డీఏను చెల్లిస్తామని కమలం పార్టీ ఈ ఎన్నికల్లో ప్రధానంగా హామీ ఇచ్చింది. ముఖ్యంగా హిందూ ఓట్లపై ఆ పార్టీ ఆశలు పెట్టుకుంది. సర్ పేరిట అక్రమంగా ఓట్ల తొలగింపునకు పాల్పడిందని, బీజేపీ అధికారంలోకి వస్తే మాంసం, చేపలు, గుడ్లు తినడంపై నిషేధం విధిస్తుందని టీఎంసీ ఆరోపించింది. తాము మరోసారి అధికారంలోకి వస్తే ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు నిర్మిస్తామని హామీనిచ్చింది.

# ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మొదటి తరువాయి

ఆర్‌టిసిని ప్రైవేటుపరం చేసే కుట్రలను అడ్డుకుంటామని హెచ్చరించారు. వెంటనే ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని కవిత డిమాండ్ చేశారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే ప్రభుత్వం, ప్రతిపక్షం సభలు పెట్టాయంటూ మండిపడ్డారు. ప్రతిపక్షం ఉట్టికథలు చెబితే.. ప్రభుత్వం పిట్టకథలు చెప్పిందంటూ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ సభలో బీజేపీపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ల గురించి ఎందుకు మాట్లాడలేదని జాగృతి అధ్యక్షురాలు నిలదీశారు. వెయ్యి ఏళ్ళైనా బీఆర్ఎస్ మారదని కవిత వ్యాఖ్యానించారు. గుంటనక్క నిన్న ఢిల్లీ వెళ్లి ఆర్ఎస్ఎస్ పెద్దలను



కలిసిందన్నారు. ప్రాజెక్ట్‌ల్లో అవినీతి నుంచి బయటపడేందుకు ఆర్ఎస్ఎస్‌తో చర్చలు జరిపారంటూ కవిత ఆరోపించారు. ఈనెల 25న తెలంగాణ రాజకీయాల్లోకి నూతన రాజకీయ శక్తిగా వస్తున్నామని, ప్రజలందరికీ ఈ వేదిక నుంచి ఆహ్వానం పలుకుతు న్నామని చెప్పారు. పార్టీ ఆవిర్భావ సభకు సిరిసిల్ల నుంచి పార్టీ కార్యకర్తలు మంగళవారం పాదయాత్రగా బయలుదేరారని తెలిపారు. తమ పార్టీ ఆవిర్భావ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చే క్యాడర్ వాహనాలకు ఎలాంటి ఎలాంటి ఇబ్బంది కలిగించొద్దని పోలీసులు, అధికార యంత్రాంగాన్ని కోరారు.

# బస్సులు బంద్

మొదటి తరువాయి

సందీప్‌కుమార్ సుల్తానీయా, ఎండీ వై నాగిరెడ్డి ఉన్నారు. వీరు ఆర్టీసీ కార్మిక సంఘాలను సచివాలయంలో చర్చలకు రావాలని ఆహ్వానించారు. జేఏసీలోని కార్మిక సంఘాలతో పాటు సమ్మెకు మద్దతు తెలుపుతున్న టీజీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, టీఎమ్‌యూ (అశ్వత్థామరెడ్డి), ఐఎన్‌టీయూసీ సంఘా లు కూడా చర్చలకు వెళ్లాయి. కమిటీ నూతనంగా ఏర్పడినందున సమస్యల్ని అధ్యయనం చేసేందుకు తమకు నాలుగు వారాల సమయం కావాలని ఐఏఎస్‌ల కమిటీ కోరింది. ఈ ప్రతిపాదనను జేఏసీతో పాటు కార్మిక సంఘాలన్నీ తీవ్రంగా వ్యతిరేకించాయి. తమ డిమాండ్లు కొత్తవేం కాదని తేల్చిచెప్పాయి. సమ్మెను నిర్వీర్యం చేసే కుట్రగా పేర్కొన్నాయి. మంగళవారం అర్ధరాత్రి మొదటి డ్యూటీ నుంచే కార్మికులంతా సమ్మెలోకి వెళ్తున్నట్టు ఆర్టీసీ జేఏసీ ప్రకటించింది. ఆర్టీసీ కార్మికులు తప్పనిసరి పరిస్థితుల్లోనే సమ్మెకు వెళ్తున్నారనీ, తమ 32 డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు పోరడ తామని టీజీఎస్‌ఆర్టీసీ జేఏసీ చైర్మెన్ ఈదురు వెంక న్న, వైస్‌చైర్మెన్ ఎమ్ థామస్‌రెడ్డి స్పష్టం చేశారు.

**ఉద్దేశపూర్వక జాప్యం**

బీఆర్ఎస్ హయాంలో ఆర్టీసీ కార్మికులు 53 రోజులు సమ్మె చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్‌పార్టీ కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపింది. అధికారంలోకి వస్తే ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్



ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు దాటినా, ఇప్పటికీ ఆర్టీసీ కార్మికుల ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదు. దీనిపై కార్మిక సంఘాల వివిధ రూపాల్లో అనేక ఆందోళనలు చేపట్టాయి. సంస్థలో ఇప్పటికీ ఆనాటి కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన యూనియన్ల రద్దు ఉత్తర్వులే అమల్లో ఉన్నాయంటూ యాజమాన్యం కార్మికశాఖ వద్ద జరిగే చర్చలకు కూడా హాజరుకాలేదు. అనివార్యంగా ఆర్టీసీ కార్మికుల సమ్మెబాట పట్టాల్సి వచ్చింది.

**ప్రయాణీకులకు ఇబ్బందులు**

ఆర్టీసీ కార్మికుల సమ్మెతో రాష్ట్రంలో పల్లెవెలుగు నుంచి రాజధాని ఎక్స్‌ప్రెస్ బస్సుల వరకు నిలిచి పోనున్నాయి. దాదాపు 10వేల బస్సుల డిపోలకే పరిమితం అవుతున్నాయి. ఆర్టీసీలోని అద్దె బస్సుల సిబ్బంది కూడా సమ్మెకు సంఘీభావంగా విధులు బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. సమ్మెతో రాష్ట్రంలో సామాన్య ప్రజలకు రవాణా కష్టాలు తప్పవు.

**97 డిపోల్లో..10 వేల బస్సులు**

రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీకి 97 డిపోల్లో 10 వేల బస్సులు ఉన్నాయి. వీటిలో దాదాపు 3,500 అద్దె బస్సులు ఉన్నాయి. సంస్థలో 39 వేల మంది కార్మికు లు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ బస్సులు రోజుకు 36 లక్షల కిలోమీటర్ల మేర ప్రయాణం చేస్తున్నాయి.

సమస్యల పరిష్కారానికి సానుకూలం: మంత్రి పొన్నం

తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంపై తమ ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ విషయంలో నిర్ణయాలు తీసుకోవడంలో కొంత జాప్యం జరిగిందని అంగీకరించారు. ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన అన్ని అంశాలను పరిశీలించేందుకు నలుగురు ఐఎఎస్ అధికారులతో ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఆర్టీసీ ప్రతినిధులంతా ఆ కమిటీకి సమస్యలు విన్నవిస్తే, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, తాను అధికారుల దగ్గర చర్చించి పరిష్కరిస్తామని చెప్పారు.

# మళ్లీ అగాధంలో రూపాయి

మొదటి తరువాయి

ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తీసుకున్న తాజా నిర్ణయం కూడా భారత కరెన్సీపై కొంత ప్రభావం చూపిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

మూడో రోజూ మార్కెట్లకు లాభాలు..

అమెరికా–ఇరాన్ మధ్య శాంతి చర్చల ఆశావహ సంకేతాలు, అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గొచ్చనే అంచనాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజూ భారీ లాభాలను సాధించాయి. మంగళవారం బీఎస్‌ఈ సెన్సెక్స్ 753.03 పాయింట్లు పెరిగి 79,273కు చేరుకుంది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 211.75 పాయింట్ల లాభంతో 24,576 స్థాయి వద్ద ముగిసింది. ముఖ్యంగా బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ రంగాల షేర్లు రాణించడంతో ఇంట్రాడేలో సెన్సెక్స్ 79,367 పాయింట్ల గరిష్ఠాన్ని తాకింది. సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, హిందుస్థాన్ యూనిలీవర్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి షేర్లు అధిక లాభాలను నమోదు చేశాయి. మరోవైపు రిలయన్స్, టైటాన్, ఎన్‌టీపీసీ వంటి స్టాక్స్ అధిక నష్టాలను మూటగట్టుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర 94.70 డాలర్ల వద్ద, బంగారం ధర 4781 డాలర్ల వద్ద నమోదయ్యాయి.

నిఫ్టీ 27వేల ఎగువకు చేరొచ్చు : పిఎల్ క్యాపిటల్

గత మూడు నెలల్లో నిఫ్టీ 6.6 శాతం పతనాన్ని చవిచూసినప్పటికీ.. 2026–28 ఆర్థిక సంవత్సరాల మధ్య ఏడాది సగటు ఆదాయాలు 15 శాతం వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని పిఎల్ క్యాపిటల్ అంచనా వేసింది. నిఫ్టీ భవిష్యత్ లక్ష్యాన్ని 27,080 పాయింట్లుగా పిఎల్ క్యాపిటల్ తన తాజా నివేదికలో అంచనా వేసింది. "ప్రపంచ అనిశ్చితులు, చమురు ధరల పెరుగుదల స్వల్పకాలిక సవాళ్లను విసురుతున్నప్పటికీ, మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు, పారిశ్రామిక ఉత్పత్తి వంటి దేశీయ అంశాలు మార్కెట్ స్థిరత్వానికి తోడ్పడతాయి" అని ఆ సంస్థ ఇన్‌స్ట్యూషనల్ ఈక్విటీస్ కోహెడ్ అమ్నిష్ అగర్వాల్ పేర్కొన్నారు.

# సీజ్‌ఫైర్‌ను పొడిగించం!

మొదటి తరువాయి

నెలకొన్నది. తమ ప్రతిపాదనలపై ఇరాన్ నుంచి స్పష్టమైన సమాధానం రాకపోవడంతో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన ఇస్లామాబాద్ పర్యటనను తాత్కాలికంగా వాయిదా వేసుకున్నట్టు సమాచారం. శాంతి చర్చలకు అమెరికా బృందానికి వాన్స్ నేతృత్వం వహిస్తున్నారు. అమెరికాతో రెండో విడత చర్చల్లో పాల్గొనేందుకు ఇరాన్ దేశ అధికారిక సమ్మతి కోసం తాము ఇంకా వేచి చూస్తున్నామని పాకిస్థాన్ మంత్రి అత్తవుల్లా తరార్ మంగళవారం ప్రకటించారు.



సీజ్ ఫైర్‌ను పొడిగించం

ఇరాన్‌తో సీజ్‌ఫైర్‌ను పొడిగించనని ట్రంప్ స్పష్టం చేశారు 'వారు కనుక శాంతి ఒప్పందం చేసుకుంటే తమను తాము బలమైన దేశంగా, అద్భుతమైన దేశంగా మరోసారి తీర్చిదిద్దుకోగలుగుతారు. యుద్ధాన్ని ముగించడానికి ఇరాన్‌తో అమెరికా ఒక గొప్ప ఒప్పందానికి వస్తుంది. వారికి ఇంకో అవకాశం లేదని నేను భావిస్తున్నానని' ట్రంప్ తెలిపారు. రెండో విడత చర్చల నుంచి ఏం ఫలితాలు ఆశిస్తున్నారన్న మీడియా ప్రశ్నకు 'మేం వారి నాయకులను తొలగించాం.

ఇది ఒక విధంగా పరిస్థితులను క్లిష్టతరం చేస్తున్నది. అయినా ఈ నాయకులు హేతుబద్ధంగా ఉన్నారు. మీరు దానిని ఏమని పిలిచినా అది పాలన మార్పే. నేను చేస్తానని చెప్పని పని ఇది. కానీ నేను దానిని పరోక్షంగా చేసి చూపించాను' అని ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ బెదిరింపుల నేపథ్యంలో ఇరాన్ స్పందించింది. తమపై బెదిరింపులకు పాల్పడుతున్న నేపథ్యంలో వారితో చర్చలకు అంగీకరించబోమని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ ఘాలిబాఫ్ స్పష్టం చేశారు.


# కాంగ్రెస్‌కు ఓటెందుకెయ్యాలి?

మొదటి తరువాయి

కలిసేందుకే తాను, ఎంపీ రవిచంద్ర, మాజీ ఎంపీ వినోద్ కుమార్ శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి ఢిల్లీకి వెళ్లామనీ, అందులో దాచిపెట్టేదేం లేదని చెప్పారు. కాళేశ్వరం కేసులో తీర్పు ఏ విధంగా వచ్చినా సుప్రీంకోర్టుకు వెళ్లాల్సి ఉంటుందనీ, వచ్చేనెల ఆరో తేదీన హైకోర్టులో రాబోతున్న ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసుల కోసం సీనియర్ న్యాయవాదులను సంప్రదించడానికే ఢిల్లీకి వెళ్లామన్నారు. కాంగ్రెస్ బీఫామ్‌పై ఎంపీగా పోటీ చేసి కూడా ఆయన ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నానంటూ ఒక ఎమ్మెల్యే అనడం, దాన్ని స్పీకర్ ధ్రువీకరించడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు సుప్రీంకోర్టులో ఓటుకు నోటు కేసు విచారణకు వస్తుందన్నారు. పట్టపగలు బ్యాగులతో దొరికిపోయిన దొంగ రేవంత్ రెడ్డి అనీ, ఇప్పుడు హోంమంత్రిగా ఆయనే ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం తరఫున నామమాత్రపు న్యాయవాదులను పెట్టి, వ్యక్తిగతంగా ఆయన తరఫున ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ్ లూద్రా వంటి ఖరీదైన న్యాయవాదులను పెట్టుకున్నారని వివరించారు. ఈ ఓటుకు నోటు కేసులో బీఆర్ఎస్ తరఫున జగదీశ్‌రెడ్డి, సంజరు, సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ ఇంప్లీడ్ అయ్యారని అన్నారు. నాడు సమైక్య వాదులతో చేతులు కలిపి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని కుట్ర చేసింది రేవంత్‌రెడ్డి కాదా? అని ప్రశ్నించారు. నాలుగున్నరేండ్ల నుంచి స్టేల మీద బతుకుతున్న రేవంత్ రెడ్డికి ఆ స్టే వెకేట్ అయిందంటే ముఖ్యమంత్రి సీటు ఊడటం, ఆయన జైలుకు వెళ్లడం ఖాయమని చెప్పారు. కేసీఆర్ 'స్టేట్స్ మన్' లాగా రాష్ట్ర ప్రయోజనాల కోసం మాట్లాడితే రేవంత్‌రెడ్డి ఆయన కుర్చీ కోసం 'స్ట్రీట్ మన్' లాగా మాట్లాడారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ సభకు పోటీగా అదే సమయానికి మైకు పట్టుకుని రేవంత్‌రెడ్డి సంకుచిత బుద్ధిని బయటపెట్టుకున్నారని అన్నారు. కేసీఆర్ వస్తున్నారని భయపడి డైవర్షన్ కోసం ఒక కిస్తీ రైతు భరోసా వేశారని చెప్పారు.

## సంపాదకీయం

# యువతరం...
# నైతిక పతనం!



కొంతమంది యువకులు రాబోవు యుగం దూతలు.. పావన నవజీవన బృందావన నిర్మాతలు.. బానిస బంధాలను తలవంచి అనుకరించరు.. పోనీ అని అన్యాయపు పోకడలు సహించరు.. వారికి నా ఆహ్వానం.. వారికి నా సెల్యూట్' అంటూ మహాకవి శ్రీశ్రీ యువతపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ, కొంతమంది యువతను, విద్యార్థుల చేష్టలను చూస్తుంటే సమాజం ఎటుపోతుందో అనే ఆందోళన కలుగుతోంది. తోటి వారి పట్ల వ్యవహరిస్తున్న తీరు వెన్నులో వణుకు పుట్టిస్తోంది. రెండురోజుల కిందట హనుమకొండకు సమీపంలోని ఓ కార్పొరేట్ కాలేజీలో జరిగిన ఘటనే ఇందుకు కారణం. తోటి విద్యార్థిని పట్ల తన పైశాచికత్వాన్ని ప్రదర్శించాడు ఓ విద్యార్థి. ఆమె నగ వీడియోను కాలేజీ వాట్సాప్ గ్రూపులో షేర్ చేసి సమాజం తలదించుకునేలా చేశాడు.

ఈ ఘటన పరిశీలిస్తే అనేక ప్రశ్నలు చుట్టుముడుతున్నాయి. ఆ వీడియో బయటకు వెళితే తాను పట్టుబడతానని ఆ విద్యా ర్థికి తెలియదా? లేదా అలాంటి వీడియోలు తీయకూడదని, షేర్ అసలే చేయకూడదనే కనీస ఇంగితం కూడా లేదా? తోటి విద్యార్థినిపై కక్ష తీర్చుకోవాలనే క్రూరమైనా ఆలోచన తప్ప తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయో అసలు ఊహించి ఉంటాడా? ప్రస్తుతం వీడియో పోస్ట్ చేసిన విద్యార్థిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. చట్టాలు, శిక్షలు ఎలా ఉన్నా.. చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం కంటే ముందే ఇలాంటి దారుణాలు జరక్కుండా ఏం చేయాలనేది ఆలోచించాల్సిన అంశం. అసలు యువత ఈ పెడధోరణులకు పాల్పడటానికి కారణలేంటి? ఇలాంటి దారుణమైన ఆలోచనలు ఎలా వస్తున్నాయి? దీనికి ఎవరు బాధ్యత వహించాలి? తల్లిదండ్రులా? అధ్యాపకులా? లేదంటే పాలకులా? కచ్చితంగా చెప్పాలంటే సమాజంలోని ప్రతి ఒక్కరూ వీటికి బాధ్యత వహించాల్సిందే. మరీ ముఖ్యంగా మన నాయకులు. వాస్తవంగా పరిశీలిస్తే నియంత్రణ లేని టెక్నాలజీ వాడకం దీనికి ఓ ప్రధాన కారణం. నేటి యువత సోషల్ మీడియాకు, టెక్నాలజీకి బానిసగా మారిపోతున్నది. పాతికేండ్లుదాటి న తర్వాత అనుభవించా ల్సినవి పదేండ్లలోపే చవిచూడాల నే ఆశ, ఆలోచన, కోరికలు పుట్టుకొస్తున్నా యి. చివరకు తోటి వాళ్లను బలిచేసైనా సరే తమ కోరిక తీర్చుకోవాలనే ఆవేశం, కసి, ఆక్రోశం పెరిగిపోతున్నది. చిన్నతనంలో తమ పనులకు అడ్డుతగల కూడదని పిల్లల చేతికి ఫోన్లు ఇచ్చి వాళ్లకు టెక్నాలజీని పరిచయం చేస్తున్నారు తల్లిదండ్రులు. తర్వాత అది లేకుండా ఉండలేని స్థితికి వచ్చేస్తున్నారు పిల్లలు. హైస్కూల్ స్థాయికే స్మార్ట్‌ఫోన్ కావాలంటూ పేచీలు పెడుతున్నారు. ఇవ్వకపోతే దారుణాలకు పాల్పడుతున్నారు. చివరకు ప్రాణాలు తీసుకుంటున్నారు లేదా తీస్తున్నారు. దాన్నే వ్యాపారంగా రూ.కోట్లు గడిస్తున్న కార్పొరేట్లు రకరకాల ఫీచర్లతో విచ్చలవిడి యాప్స్‌ను క్రియేట్ చేసి సమాజంపై వదులుతున్నారు. విద్యార్థులు, యువత వాటికి బానిసలైపోతున్నారు. నిజం చెప్పాలంటే నేడు స్మార్ట్‌ఫోన్ డ్రగ్స్ కంటే కూడా ప్రమాదకరమైన వ్యసనంగా మారిపోయిందని చెప్పొచ్చు. ప్రపంచ వ్యాప్తంగా సుమారు నలభై శాతం విద్యాసంస్థలు, 79 దేశాలు పిల్లలు స్మార్ట్‌ఫోన్ వాడకాన్ని నిషేధించాయి. మనకంటే ఎక్కువ జనాభా ఉన్న చైనా తమ పిల్లలు స్మార్ట్‌ఫోన్లకు బానిసలు కాకుండా ప్రభుత్వమే రకరకాల కార్యకలాపాల్లో శిక్షణ ఇస్తుంది. అత్యంత చిన్న వయసు నుండే పుస్తకాలు చదివేలా, లైబ్రరీలకు వెళ్లేలా, వివిధ ఆటల్లో శిక్షణ తీసుకునేలా ప్రోత్సహిస్తుంది. ఫలితంగా యువతలో మానవ విలువలు కాపాడుకునే ప్రయత్నం చేస్తుంది చైనా. మరి మన దేశంలో ఆ కృషి చేయలేమా? పక్క రాష్ట్రమైన ఏపీ ప్రభుత్వం పన్నెండేండ్లలోపు పిల్లలకు స్మార్ట్‌ఫోన్ బ్యాన్ చేస్తూ జీవో విడుదల చేసింది. భవిష్యత్తులో పద్దెనిమిదేండ్ల పిల్లల వరకు పరిమితి విధించాలనే యోచన కూడా చేస్తోంది. అయితే ఇది ఆచరణలో ఎలా ఉంటుందో వేచి చూడాలి. మన రాష్ట్రంలో కూడా అలాంటి ప్రయత్నం అవసరం.యువత భవితను దృష్టిలో పెట్టుకొని సోషల్ మీడియా వేదికలు నిర్వహించే యాజమాన్యం కూడా యాప్స్ తయారీలో కొన్ని పరిమితులు పాటించాలి. కేంద్ర పాలకులు కేవలం తమ అధికారాన్ని కాపాడుకునేందుకు యువతను వాడుకోకుండా దేశ భవితను కూడా దృష్టిలో పెట్టుకోవాలి. ఇంకా ఆలస్యం చేస్తే యువత పూర్తిగా మన చేయి దాటిపోతుంది. శ్రీశ్రీ చెప్పినట్టు 'కొంతమంది కుర్ర వాళ్లు పుట్టుకతో వృద్ధులు.. పేర్లకి పకీర్లకి పుకార్లకి నిబద్ధులు' అన్న మాటలు నిజం చేద్దామా? లేదా 'కొంతమంది యువకులు రాబోవు యుగం దూతలు.. పావన నవజీవన బృందావన నిర్మాతలు'గా తీర్చిదిద్దుకుందామా అనేది ప్రభుత్వాలే కాదు, పౌర సమాజమూ ఆలోచించాలి. అందుకే భావి భారతాన్ని నిర్మించాల్సిన యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నది.

# సర్వే నెంబర్ 6 5 7
# భూమి కబ్జా ఆపండి

**-ఆర్డీవో, ఎమ్మార్వో సూపర్డెంట్ కు వినతి పత్రం**
**-సామాజికవేత్త శ్రీనివాస్ గౌడ్**



**దేవరకొండ ఏప్రిల్ 21 ( మహాప్రభ)**
దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో సర్వేనెంబర్ 657 లోగల ప్రభుత్వ భూమి కబ్జా కు గురి అవుతున్న భూమి నీ ప్రభుత్వం స్వాధీన పరుచుకోవాలి.
ఆర్డీవో రమణారెడ్డి, ఎమ్మార్వో సూపర్డెంట్ రేణుకకు వినతి పత్రం అందజేశారు.
సామాజికవేత్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు
దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనెంబర్ 657 గల ప్రభుత్వ భూమి లో అక్రమంగా ఇంటి నిర్మాణం, కొంతమంది వ్యక్తులు ప్లాట్ల రూపంలో కబ్జా చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకుంటూ స్వాధీనం చేసుకోవాలని ఆర్డిఓ రమణారెడ్డి , ఎమ్మార్వో సూపర్డెంట్ రేణుక కువేరువేరుగా వినతి పత్రాలు అందజేశారు.
ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనెంబర్ 657లో డిండి హైవే రోడ్ ఎల్ఐసి ఆఫీస్ వెనుక భాగాన బంజారా కాలనీ తూర్పు భాగాన కొంతమంది అక్రమంగా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తూ గృహ నిర్మాణాలు చేస్తున్నారు. కొంతమంది వ్యక్తులు ప్లాట్ల రూపంలో కబ్జా చేస్తూ రాళ్లతో హద్దులు నిర్మాణం చేసుకొని ప్రభుత్వ భూమిని కాజేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. దీనివలన ప్రభుత్వ కార్యాలయాలకు ప్రభుత్వ అవసరాలకు భవిష్యత్తులో ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉంటుంది. అక్రమంగా భూమిలోఇండ్ల నిర్మాణం చేస్తూ కొంతమంది హద్దురాళ్లతో కబ్జాకు గురి చేయడం వల్ల భూదోపిడి జరుగుతుంది. ప్రజా ప్రయోజనాల దృశ్య ఇట్టి భూమిని స్వాధీన పరుచుకొని ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకుంటే మంచిగుంటుందని మా అభిప్రాయం. భూమిని పరిశీలించి సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటూ ప్రభుత్వ భూమి కాపాడాలని మా యొక్క మనవి. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, పున్న వెంకటేష్ నేత, భీమగోల శివ గౌడ్ , పెరికేటిశ్రీనివాస్ చారి, డాక్టర్ భాషా చౌహన్ ,నటవ సుధాకర్, పున్న బిక్షమయ్య, గడ్డం బిక్షమయ్య, గణేష్ ,హరి ,చెరుకు అంజి గౌడ్, అనిల్ గౌడ్, సంజీవ యాదవ్, యాదయ్య చారి, అంకం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు

# KGBV లో హాస్టలో పోషణ పక్షం విజయవంతం

**ICDS, సూపర్వైజర్ విజయలక్ష్మి**

**దేవరకొండ ఏప్రిల్ 21( మహాప్రభ )**
రోజున ,పోషణ పక్షంలో భాగంగా, మైనంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కొర్రతండ అంగన్వాడీ కేంద్రశీ మరియు దేవరకొండ ఖ+దీఎ హాస్టలో పోషణ పక్షం ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో భాగంగా సూపర్వైజర్ విజయలక్ష్మి మరియు డి సిపియు యూనిట్ సభ్యులు అంజలి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పకుండా పోషక విలువలు కలిగినటువంటి ఆహార పదార్థాలు ప్రతినిత్యం తీసుకోవాలి అని వివరించారు, ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు మరియు పిల్లలు సిరి ధాన్యాలతో పాటుగా మన పరిసరాలలో దొరికే కాయగూరలు, ఆకుకూరలు, పండ్లు తప్పకుండా తీసుకోవాలి అని తెలియజేయడం జరిగింది. అలాగే వేయి రోజుల ప్రాముఖ్యత గురించి,మూడు నుంచి



ఆరు సంవత్సరాల వయసులో పిల్లల మెదడు 90 శాతం అభివృద్ధి జరుగుతుంది కాబట్టి ఈ వయసులో పిల్లలకు ఎక్కువ అవకాశాలు కల్పించాలి అప్పుడే వారి అభివృద్ధి కుంటూ పడకుండా ఉంటుందని తెలియజేయడం జరిగింది. అలాగే డిసిపియు యూనిట్ మెంబర్ అంజలి బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి, బాల్యవివాహాలు చేయడం ద్వారా తల్లిదండ్రులకు మరియు ప్రోత్సహించే అటువంటి వారికి ఎలాంటి శిక్షలు పడతాయి అని వివరించడం, తల్లిదండ్రులు లేని అనాథ బాలలకు మిషన్ వాత్సల్య పథకంపై అవగాహన కలిపించడం అక్రమంగా పిల్లలను దత్తత తీసుకోవడం ఇవ్వడం చట్టరీత్య నేరం అన్ని అవగాహన కల్పించటం జరిగింది ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొర్ర రాంసింగ్ మాట్లాడుతూ అంగన్వాడీ కి పిల్లలను పంపించాలి గవర్నమెంట్ నుండి వచ్చేవి బెనిఫిట్స్ వినియోగించుకోవాలని అలాగే ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో కేజీబీవీ ూూ సావిత్రి, హెల్త్ డిపార్ట్మెంట్ నుంచి పల్లె దావకాన డాక్టర్ స్వాతి ఏఎన్ఎం విద్యావతి విజయ,అంగన్వాడి టీచర్లు బుజ్జి , కమలమ్మ, లచ్చి ఆశా కార్యకర్త దానమ్మ వార్డ్ మెంబెర్స్,తల్లిదండ్రులు యూత్ పాల్గొనడం జరిగింది

# హైదరాబాద్‌లో
# గజదొంగ గుట్టురట్టు

**-వరుస చోరీలకు బ్రేక్!**




**కూకట్పల్లి, ఏప్రిల్ 21, (మహాప్రభ)**
హైదరాబాద్ కేపీహెచ్బీ పోలీసుల సక్సెస్ ఆపరేషన్‌లో అంతర్రాష్ట్ర గజదొంగ షేక్ జంషీద్ అలియాస్ జమ్మి అరెస్ట్ అయ్యాడు. మొత్తం యాభై నాలుగు దొంగతనం కేసుల్లో నిందితుడిగా పోలీసులు గుర్తించారు. తాళం వేసి ఉన్న ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడటం జంషీద్ ప్రత్యేకతగా పోలీసులు తెలిపారు. ఇళ్ల తాళాలు పగలకొట్టి నగరంలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్నాడని విచారణలో బయటపడింది.నిందితుడి వద్ద నుంచి మూడు లక్షల రూపాయల విలువైన ఎనిమిది మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అదనంగా చోరీలకు ఉపయోగించిన స్కూటర్‌ను కూడా పోలీసులు సీజ్ చేశారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని మిద్నాపూర్ ప్రాంతానికి చెందిన జంషీద్, హైదరాబాద్ కింగ్ కోటి ప్రాంతంలో నివాసం ఉంటూ చోరీలు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. నగర ప్రజలకు భయం కలిగించిన వరుస దొంగతనాలకు చెక్ పెడుతూ కేపీహెచ్బీ పోలీసులు కీలక నిందితుడిని అరెస్ట్ చేసి మరోసారి తమ పనితీరును నిరూపించారు

# అకాల వర్షాలకు
# విరిగిన వేప చెట్లు

**దేవరకొండ డివిజన్ ఏప్రిల్ 21, (మహాప్రభ )**
దేవరకొండ పట్టణం ముత్యాలమ్మ బజార్ ఒకటవ వార్డులో మంగళవారం మధ్యాహ్న సమయంలో అనుకోకుండా కురిసిన ఈదురు గాలులతో కూడిన వాన కురవడంతో



పట్టణంలో చాలా చోట్ల వడగండ్లు తో కూడిన వర్షం కురిసింది. పట్టడంలో చాలా చోట్ల చెట్లు వినడంతో కరెంటు కు అంతరాయం ఏర్పడి ప్రజలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

# తెలుగుపల్లి గ్రామపంచాయతి పరిధిలో నీటి బోర్ వేసిన సర్పంచ్ రామ దేవి



**దేవరకొండ డివిజన ఏప్రిల్ 21(మహాప్రభ)**
దేవరకొండ పరిధిలోని తెలుగు పల్లి గ్రామపంచాయతీలో నీటి కొరత ఉండటంతో తెలుగు పల్లి గ్రామపంచాయతీ గ్రామ సర్పంచ్ చాట్ల రమాదేవి రాములు గారు వేసవికాలం రావడం వల్ల ఎండ తీవ్రతకు నీళ్లు ఇబ్బందిఅవ్వడం వల్ల కుంటకట్ట దగ్గర నర్సరీకి కొత్తగా మోటారు వేశారు ఇ కారికర్మంలో పాలుగోనవారు ఏడుపుల రిమేష్, పర్వతాలు అంజయ్య ,జూ సైదయ్య, తదితరులు పాలుగొన్నారు

# నాగులపల్లిలో BSP నాయకుడు శాంతయ్యకు ఘన నివాళి

**నర్సాపూర్ ,ఏప్రిల్ 21(మహాప్రభ):**
నర్సాపూర్ మండలం నాగులపల్లి గ్రామంలో దీూూ ఉమ్మడి మెదక్ జిల్లా నాయకులు శాంతయ్య గారి మృతి పట్ల స్థానికంగా విషాద



వాతావరణం నెలకొంది. వారి పార్థివదేహాన్ని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సుహాసిని రెడ్డి దర్శించి పూలమాలలు అర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ బహుజన ఉద్యమంలో అలుపెరగని పోరాటం చేస్తూ, బహుజన రాజ్య స్థాపన కోసం చివరి శ్వాస వరకు కృషి చేసిన నిస్వార్థ నాయకుడు శాంతయ్య అని కొనియాడారు. ఆయన మృతి బాధాకరమని పేర్కొంటూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రవీందర్, నాగులపల్లి సర్పంచ్ సుమతి శివకుమార్, లింగం, మోహనదాస్, సాయి శరణ్ గౌడ్, రమేష్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నమస్తే మహాప్రభ
జనరల్ న్యూస్
బుధవారం 22-04-2026
WWW.MAHAAPRABHA.COM తెలుగు దినపత్రిక
MAHAA PRABHA NEWS


# విబిజి రామ్ జి చట్టాన్ని రద్దుచేసి ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలి


## పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి



**దేవరకొండ డివిజన్ ఏప్రిల్ 21(మహాప్రభ ),**
దేవరకొండ పరదిలో నీ కొండ మల్లెపల్లి గ్రామపంచాయతి లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవసాయ కార్మికుల పొట్టగొట్టే వి బి జి రామ్ జి చట్టాన్ని రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్య లు కంబాలపల్లి ఆనంద్ కోరారు మంగళవారం రోజున కొండ మల్లేపల్లి ఎంపీడీవో ఆఫీసు ముందు ఉపాధి కూలీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరుగు ధర్నా కార్యక్రమంలో కంబాలపల్లి ఆనంద్ . మాట్లాడుతూ ఖూూ -1 కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలో సామాజిక భద్రత, వలసల నివారణలో భాగంగా, కమ్యూనిస్టు పార్టీలు పోరాడి సాధించిన జాతీయ ఉపాధి ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి విబిజి రాంజీ పథకం పేరుతో ఉపాధి కూలీల పొట్టగొట్టే చట్టాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిందని ఈ చట్టానికి వ్యతిరేకంగా వ్యవసాయ కూలీలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఉపాధి కూలీలకు పని ప్రాంతాల్లో కనీసం మంచినీటి సౌకర్యం కల్పించకపోవడం శోచనీయమన్నారు. ప్రథమ చికిత్స కిట్టులు లేకుండా, టెంట్లులేకుండా వ్యవసాయ కూలీలతో పనులు చేయించుకుంటున్నారన్నారు. ఐరిష్ పేరుతో పని ప్రదేశంలో సిగ్నల్ రాకపోవటంవల్ల పని ప్రదేశంలో నుండి అందరు ఇంటికి పోవటం జరుగుతుంది కొంతమంది కూలీలకు ముఖము పోటోవ్ రాకపోవటం నానా రకాలుగా ఉపాధి కూలీలు ఇబ్బంది పడుతున్నారు అన్నారు. మూడు నాలుగు గంటలు పని చేసిన తర్వాత ఐరిష్ రాకుంటే ఉపాధి కూలీలను ఇంటికి పంపుతున్నారని, ప్రత్యామ్నాయ మార్గాలు లేకుండా పని చేసిన తర్వాత కూడా ఇంటికి పంపడం చాలా దుర్మార్గం అన్నారు.ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం నాలుగు గంటల వరకు పని చేస్తున్నప్పటికీ కూలి గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడు వారాలుగా పనిచేసిన డబ్బులు ప్రభుత్వం ఇవ్వకపోవడం సిగ్గుచేటు అన్నారు. పని మొదలుపెట్టినప్పుడు, ముగిసిన తర్వాత రెండు సార్లు ఫోటోలు తీయడం వల్ల కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సాఫ్ట్వేర్ ప్రాబ్లం తో ఫోటోలు మ్యాచ్ కాకపోవడం వల్ల కార్మికులు పని నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఈ కే వై సి పేరుతో జాబ్ కార్డు తొలగించటం కొత్తగా పని కార్డు కోసం అప్లై చేస్తున్న వారికి జాబ్ కార్డు ఇవ్వడం లేదని కేవలం ఇందిరమ్మ ఇండ్ల సాంక్షన్ అయిన వారికి మాత్రమే ఇస్తామని సమాధానం చెబుతున్నారని, ఇది కార్మికుల పొట్ట కొట్టడమేనని అన్నారు. గత పది సంవత్సరాలుగా గడ్డపారలు, పారులు, తట్టలు లాంటి పనిముట్లు ఇవ్వడం లేదని వెంటనే వాటిని ఇవ్వాలని పని అడిగిన వెంటనే పనులు చూపాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ చట్టాన్ని మోడీ ప్రభుత్వం కుట్రపూరితంగా కూలీలపై కక్షగట్టి ఆ చట్టాన్ని రద్దుచేసి పీబీజీ రాంజీ చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. గత చట్టంలో కార్మికులకు ఉన్న సౌకర్యాలను ఈ చట్టంలో రద్దు చేసింది అన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం 90% నిధులు ఇస్తే రాష్ట్రం 10% నిధులు ఇచ్చేది అన్నారు. కొత్త చట్టంలో కేవలం 60 శాతం మాత్రమే కేంద్రం ఇస్తుందని చెప్పడం ఉపాధి కూలీలను నట్టేట ముంచడమేనన్నారు. గత 12 సంవత్సరాలుగా బడ్జెట్లో ఉపాధిహామీ పథకానికి నిధులు కోత పెడుతూ వస్తుందన్నారు. ఈ బడ్జెట్లో ఆరు లక్షల కోట్ల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేశారు. పేదలకు ఉపాధి కల్పించే బాధ్యతనుండి కేంద్ర ప్రభుత్వం తప్పుకుంటుందన్నారు. పేదల పుట్టగొట్టే చట్టాన్ని తీసుకొచ్చిన బిజెపి ప్రజా ప్రతినిధులను ఎక్కడికక్కడ నిలదీయాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ కూలీలందరూ బిజెపి తీసుకొచ్చిన విబిజి రాంజీ చట్టాన్ని రద్దు చేయాలని కొత్త జాబ్ కార్డు వెంటనే ఇవ్వాలని పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని రెండు సార్లు ఫోటో తీసే విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ధర్నా అనంతరం ఎంపీడీవో కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది . ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు కావలి కృష్ణయ్య మెట్లు వాస్కుల యాదయ్య విజయశాంతి సత్యనారాయణ పార్వతమ్మ సత్తయ్య సత్యమ్మ భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రియుడి కోసం దొంగతనం..

-రూ.2 లక్షల లగ్జరీ వాచీలు ఎత్తుకెళ్లిన యువతి అరెస్ట్





**హైదరాబాద్, ఏప్రిల్ 21(మహా ప్రభ)**
ప్రేమ పేరుతో నేరానికి పాల్పడిన యువతి చివరకు పోలీసులకు చిక్కింది. ప్రియుడికి పుట్టినరోజు కానుక ఇవ్వాలనే ఉద్దేశంతో ఖరీదైన వాచీలను దొంగిలించిన ఘటన హైదరాబాద్‌లో సంచలనంగా మారింది. పోలీసుల వివరాల ప్రకారం, ఖమ్మం జిల్లాకు చెందిన 26 ఏళ్ల యువతి తన ప్రియుడితో కలిసి కారులో జూబ్లీహిల్స్ ప్రాంతానికి చేరుకుంది. ప్రియుడిని కారులోనే ఉంచి, కస్టమర్‌లా ప్రముఖ వాచ్ షోరూమ్‌లోకి ప్రవేశించింది. షోరూమ్‌లో సేల్స్‌మెన్‌ను మాటల్లో నిమగ్నం చేసి, సుమారు రూ.2 లక్షల విలువైన రెండు టిస్సాట్ (ఆటంంశీ) బ్రాండ్ లగ్జరీ వాచీలను తన హ్యాండ్‌బ్యాగ్‌లో దాచుకుని అక్కడి నుంచి నిశ్శబ్దంగా వెళ్లిపోయింది.వాచీలు కనిపించకపోవడంతో షోరూమ్ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించిన పోలీసులు యువతి వచ్చిన కారు నంబర్ ఆధారంగా ఆమెను ఖమ్మంలో గుర్తించి అరెస్ట్ చేశారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# అంబేద్కర్ మనవడు భీంరావు యశ్వంత్ అంబేద్కర్‌తో ముంబైలో కర్క నాగరాజు భేటీ



**కూకట్పల్లి ,ఏప్రిల్ 21, (మహాప్రభ)**
గ్రేటర్ హైదరాబాద్ ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం (ఎ.ఐ.ఎ.వై.ఎస్) అధ్యక్షుడు, కార్మిక నాయకుడు కర్క నాగరాజు ఉద్యమ యాత్రలో భాగంగా ముంబై నగరాన్ని సందర్శించాడు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ యువజన సంఘాల నాయకులతో కలిసి ముంబై దాదర్‌లో భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రెండవ మనవడు, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు భీంరావు యశ్వంత్ అంబేద్కర్‌ను అంబేద్కర్ భవన్‌లోని ప్రబుద్ధ ప్రింటింగ్ ప్రెస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భీంరావు యశ్వంత్ అంబేద్కర్‌కు కర్క నాగరాజు శాలువా కప్పి సన్మానించాడు. అనంతరం తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్న పూలే-అంబేద్కర్ ఉద్యమ కార్యక్రమాల భావజాలాన్ని వివరించాడు. నాగరాజు చేపడుతున్న కార్యక్రమాలను అభినందించిన భీంరావు యశ్వంత్ అంబేద్కర్, తెలంగాణలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నిర్వహిస్తున్న కార్యకలాపాలపై ఆసక్తిగా వివరాలు తెలుసుకున్నాడు. ఈ భేటీలో భారతీయ సమాజ్ సేవా సమితి మాదిగ (రిజి) కార్యదర్శి కేదాస్ గురునాథ్ మహరాజ్, ఎం.టి.బి.ఎఫ్ నాయకులు ఎల్ది రఘునాథ్ పద్మశాలి, మూలనివాసి మాలజీ, కర్క లోహిత్ రాజ్, కర్క కార్తీక్ రాజ్ పాల్గొన్నారు.

# గచ్చిబౌలి టీఎన్జీవో కాలనీలో అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదం






**శేరిలింగంపల్లి ఏప్రిల్ 21(మహాప్రభ )**
హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి పరిధి టీఎన్జీవో కాలనీలో అగ్ని ప్రమాదం కలకలం రేపింది. ఒక అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో జరిగిన షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు ప్రాథమిక సమాచారం. క్షణాల్లోనే మంటలు విస్తరించడంతో పాటు దట్టమైన పొగ భవనం అంతటా వ్యాపించి నివాసితులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. పై అంతస్తుల్లో చిక్కుకున్న వారిని అగ్నిమాపక సిబ్బంది సకాలంలో రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ ఘటనలో ఊపిరి ఆడక ఇద్దరు వ్యక్తులు అస్వస్థతకు గురికాగా, వారిని వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మంటల కారణంగా సెల్లార్‌లో నిలిపి ఉంచిన సుమారు 15 బైక్‌లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఘటనపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు

# లెన్స్‌కార్ట్ సీఈవో వ్యాఖ్యలపై నిరసన హిందూ సంప్రదాయాల గౌరవంపై అవగాహన కార్యక్రమం.





**కొత్తపేట -21 ఏప్రిల్ (మహాప్రభ)**
ఇటీవల లెన్స్‌కార్ట్ సీఈవో పీయూష్ బన్సాల్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ తన కార్యకర్తలతో కలిసి లెన్స్‌కార్ట్ షాప్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులకు బొట్టు పెట్టడం ద్వారా హిందూ సంప్రదాయాల ప్రాముఖ్యతను తెలియజేశారు. హిందూ సంస్కృతిని గౌరవించాలని, ప్రజల భావాలను దెబ్బతీసే విధంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయకూడదని ఆయన సూచించారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షులు మంచి రాజేష్ కుమార్ , జిల్లా నాయకులు వగ్గుల సుందర్ నారాయణ, కాటా విజయ గౌడ్ , లావణ్య , శ్రీనివాస్ రెడ్డి , తిరుమల , వెంకట్ రెడ్డి , గట్టు మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నర్సాపూర్ చెరువు ఆయకట్టు సందర్శించిన ఆవుల రాజిరెడ్డి



**నర్సాపూర్,ఏప్రిల్ 21 (మహాప్రభ):**
నర్సాపూర్ రాయరావు చెరువు నుంచి పంట పొలాలకు వెళ్లే నీటి ప్రవాహంలో కొన్నిచోట్ల సరైన కల్వట్లు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి నేడు ఆ ప్రాంతాన్ని ప్రత్యక్షంగా సందర్శించారు.ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడిన ఆయన, సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నీటి సరఫరా సక్రమంగా జరిగేలా కల్వట్ల నిర్మాణ పనులను వీలైనంత త్వరగా ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నర్సాపూర్ పట్టణంలో నూతనంగా ఎంపికైన 70 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి మరియు ఆవుల రాజిరెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# జేత్యా తండాలో ఘనంగా జరిగిన పోషణ పక్షం

ఐ సి డి ఎస్. సూపర్వైజర్ డి. చిట్టెమ్మ




**దేవరకొండ ఏప్రిల్ 21( మహాప్రభ )**
పోషణ పక్షంలో భాగంగా దేవరకొండ మండలం జెత్యతండ అంగన్వాడి కేంద్రంలో గర్భిణీలు బాలింతలు మరియు పిల్లలు తీసుకోవలసిన పోషక విలువల గురించి డి చిట్టెమ్మ సూపర్వైజర్ వివరించారు , పరిసరాలలో దొరికే ఆకుకూరలు మునగ ,బొప్పాయి సీజనల్ పండ్లు సిరి ధాన్యాలు ,చిరు ధాన్యాలు తప్పకుండా తీసుకోవాలని పిల్లలతో ఎక్కువగా మాట్లాడితే మెదడు అభివృద్ధి వేగంగా జరుగుతున్నదని మూడు నుంచి ఆరు సంవత్సరాల వయసులో ఆటలు పాటలు కథలు సంభాషణ ద్వారా పిల్లల మెదడు అభివృద్ధి . జరుగుతుందని వివరించారు.కావున ఈ వయసులో పిల్లలకు ఆటపాటలతో విద్యను అందించాల్సిన అవసరం చాలా ఉంది అని తెలియజేశారు ఈ విషయంలో తల్లిదండ్రులు ఇంటి వద్ద మరియు అంగన్వాడీ టీచర్ స్కూల్లో పిల్లలకు ఎక్కువగా నేర్చుకునే అవకాశాలను కల్పించడం ద్వారా వాళ్ళ అభివృద్ధి మైలురాళ్లను చేరుకుంటారని తెలియజేశారు, అంగన్వాడి కేంద్రం నందు నమోదు కాబడిన గర్భిణీ స్త్రీలు, బాలింత తల్లులు, పిల్లలు అనుబంధ ఆహారం, ఆరోగ్య లక్ష్మి భోజనం. తప్పకుండా తీసుకోవాలని తెలిపారు కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ బంగారి, ఆశ వర్కర్ తల్లులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# ఉచిత వైద్య శిబిరం... లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో







**దేవరకొండ ఏప్రిల్ 21( మహాప్రభ )**
లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ ఆధ్వర్యంలో మండల పరిధిలోని వెంకటంపేట స్టేజి (దేన్యా నాయక్ తండా)లో ఉచిత కంటి, బీపీ మరియు షుగర్ పరీక్షల వైద్య శిబిరాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.ప్రొఫెసర్ లయన్ రామావత్ రవి నాయక్ మరియు వారి సోదరులు తమ తండ్రిగారైన స్వర్గీయ రామావత్ పిత్యా నాయక్ జ్ఞాపకార్థం ఈ శిబిరానికి పూర్తి ఆర్థిక సహాయాన్ని అందించారు.శిబిరానికి విచ్చేసిన తండావాసులకు ఉచితంగా రక్తపోటు (బీూ), మధుమేహం (రాబస్త్రుతీ) పరీక్షలతో పాటు కంటి పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి, సెక్రటరీ మల్లయ్య లకుమారపు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.వీరితో పాటు హనుమాన్ నాయక్, బగ్గు నాయక్, హరి నాయక్, శ్రీను నాయక్, శంకర్ నాయక్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పిత్యా నాయక్ స్మారకార్థం సమాజ సేవకు ముందుకు వచ్చిన రవి నాయక్ కుటుంబ సభ్యులను వారు అభినందించారు. ఈ అవకాశాన్ని తండావాసులు మరియు చుట్టుపక్కల గ్రామస్థులు పెద్ద సంఖ్యలో వినియోగించుకున్నారు.

# ఒకేరోజు 58 మందికి శిక్షలు

**డ్రంక్ & డ్రైవ్‌పై పోలీసుల కఠిన చర్యలు**



**కామారెడ్డి ఏప్రిల్ 21 (మహాప్రభ)**
జిల్లాలో డ్రంక్ ఢ డ్రైవ్‌పై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఒకేరోజు తనిఖీల్లో పట్టుబడిన 58 మందికి న్యాయస్థానం శిక్షలు విధించింది. వీరిలో 4 మందికి ఒక్క రోజు జైలు శిక్ష, మరో 4 మందికి రెండు రోజుల జైలు శిక్ష విధించగా, మొత్తం రూ. 75,000 జరిమానా విధించబడింది. జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర ఐపీఎస్, మాట్లాడుతూ ప్రమాదాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. "ప్రమాదాలు విధి కాదు -- మన నిర్లక్ష్య ఫలితమే" అని స్పష్టం చేశారు. కుటుంబ పెద్ద రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబం ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం ప్రాణాలతో చెలగాటం ఆడటమేనని హెచ్చరించారు. క్షణికానందం కోసం చేసే తప్పు కుటుంబాలను చీకటిలోకి నెట్టేస్తుందని పేర్కొన్నారు. "ప్రమాదం ముందస్తుగా చెప్పి రాదు" అనే విషయాన్ని గుర్తుంచుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతతో డ్రైవింగ్ చేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ, ప్రజలు స్వచ్ఛందంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

# ఏఎస్పీ చైతన్య రెడ్డినీ సన్మానించిన సీనియర్ జర్నలిస్ట్




**కామారెడ్డి ఏప్రిల్ 21 (మహాప్రభ)**
కామారెడ్డి జిల్లాలో గత 15 నెలలుగా అదనపు పోలీసు అధికారి (ఏఎస్పీ)గా విధులు నిర్వహించిన చైతన్య రెడ్డి, సంగారెడ్డి జిల్లాకు ఏఎస్పీగా వెళ్తున్న ఆమెను కామారెడ్డి సీనియర్ జర్నలిస్ట్ హరీష్ సన్మానించారు ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు హరీష్ శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ, కామారెడ్డి జిల్లాలో చైతన్య రెడ్డి తన పదవీ కాలంలో సమర్థవంతంగా విధులు నిర్వహించి, పేద ప్రజలకు సమన్యాయం అందించి ప్రజల ప్రశంసలు పొందారని తెలిపారు. ఆమె సంగారెడ్డి జిల్లాలో మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు, స్నేహితులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జూదంపై పోలీసుల ఉక్కుపాదం

**మాచారెడ్డి, కామారెడ్డిలో దాడులు - 9 మంది అరెస్ట్**
**నగదు, మొబైల్ ఫోన్లు, వాహనాల స్వాధీనం**



**కామారెడ్డి,ఏప్రిల్ 21(మహాప్రభ)**
జిల్లాలో అక్రమ పేకాటపై పోలీసుల చర్యలు కఠినతరం అయ్యాయి. మాచారెడ్డి, కామారెడ్డి పట్టణ పరిధిలో మంగళవారం పోలీసులు నిర్వహించిన మెరుపు దాడుల్లో మొత్తం 9 మంది అరెస్టయ్యారు. వారి వద్ద నుండి నగదు, మొబైల్ ఫోన్లు, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని చుక్కాపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని, రూ. 3,750 నగదు, 4 మొబైల్ ఫోన్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా కామారెడ్డి పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీలో నిర్వహించిన దాడుల్లో ఐదుగురిని అరెస్ట్ చేసి, రూ. 7,590 నగదు, 5 మొబైల్ ఫోన్లు, ఒక ఆటోను సీజ్ చేశారు. ఈ రెండు ఘటనలపై సంబంధిత పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర, మాట్లాడుతూ జూదం అనేది వ్యసనంగా మారి కుటుంబాలను ఆర్థికంగా దెబ్బతీస్తుందని హెచ్చరించారు. క్షణిక లాభాల కోసం పేకాటకు అలవాటు పడకూడదని సూచించారు. పేకాటలో పట్టుబడితే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడైనా పేకాట, జూదం లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ హామీ ఇచ్చారు.

# గ్రామంలో హెల్త్ క్యాంప్‌కు విశేష స్పందన



**శివంపేట, ఏప్రిల్ 21 (మహాప్రభ):**
శివంపేట్ మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద హెల్త్ క్యాంప్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పెంజర్ల మమత ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్య బృందం గ్రామానికి చేరుకుని ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఇలాంటి వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ హెల్త్ క్యాంప్‌కు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలు పొందారు.

# సంక్షేమ వారోత్సవాల్లో అవగాహన కార్యక్రమం

**తాడ్వాయి, ఏప్రిల్ 21 (మహాప్రభ)**
సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా కామారెడ్డి జిల్లా తాడ్వాయిలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ (గర్ల్స్)లో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 'ప్రజా పాలన', 'ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాల సందర్భంగా రెండో రోజు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆరవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినులకు మానసిక శ్రేయస్సు, మాదకద్రవ్యాల దుర్వినియోగ నివారణపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ మరియు సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సైకియాట్రిస్ట్‌లు రమణ, రాహుల్, డొమకొండ ఎస్ఐ దీపిక పాల్గొని విద్యార్థినులకు పలు అంశాలపై వివరించారు. మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యత, ఒత్తిడి నిర్వహణ పద్ధతులు, ఆరోగ్యకర జీవనశైలి అలవాట్లు, అవసరమైనప్పుడు సహాయం పొందాల్సిన అవసరాన్ని వివరించారు. అలాగే మాదకద్రవ్యాల వినియోగం వల్ల




కలిగే దుష్ప్రభావాలు, వాటి నివారణ మార్గాలు, తోటివారి ఒత్తిడిని ఎదుర్కోవడం, చట్టపరమైన అవగాహన వంటి విషయాలను స్పష్టంగా తెలియజేశారు. డ్రగ్ దుర్వినియోగ సమస్యలను నివేదించేందుకు పోలీస్ ఎమర్జెన్సీ నంబర్లు 100, 112, జాతీయ టోల్ ఫ్రీ డ్రగ్ డీ-అడిక్షన్ హెల్ప్‌లైన్ 14446, 1800-11-0031, అలాగే మానస్




నార్కోటిక్స్ హెల్ప్‌లైన్ 1933 గురించి విద్యార్థినులకు వివరించారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థినులు ఆసక్తిగా పాల్గొని విజ్ఞానదాయకంగా భావించారు. కార్యక్రమం నిర్వహణకు సహకరించిన నిపుణులు, తెలంగాణ పోలీస్ విభాగానికి పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.

# దేవరకొండలో ఉరుములు మెరుపులతో వర్షం



**దేవరకొండ ఏప్రిల్ 21 ( మహా ప్రభ**
దేవరకొండ మరియు సమీప ప్రాంతాలలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులు, మెరుపులు, ఉరుములతో కూడిన వర్షం కురిసింది, ఇళ్లలో నుంచి పిల్లలు పెద్దలు ఎవరు బయటకు రావద్దని తల్లిదండ్రులు పెద్దలు హెచ్చరికలు చేసుకున్నాం, సురక్షితంగా ఉండాలని తల్లిదండ్రులు పిల్లలకు హెచ్చరికలు చేశారు, ఇంటి మీదనే పిడుగు పడుతుందన్న ఆందోళనలో ప్రజలు భయాందోళనలు చెందారు, దాదాపు 40 నిమిషాలు వర్షం కురిసింది, రహదారుల వెంట నీరు ప్రవహించింది, లోతట్టుగా ఉన్న స్థలములలో నీరు నిలిచింది, ఆకస్మాత్తుగా వాతావరణం చల్లబడింది, ప్రజలందరూ చల్లదనాన్ని ఆస్వాదిస్తూ సంతోషించారు, విద్యుత్ సౌకర్యం నిలిచిపోవడం వలన ప్రజలు కొంత అసౌకర్యానికి గురైనారు, మండుటెండల్లో ప్రజలకు కొంత ఉపశమనం కలిగిందని పలువులు సంతోషాన్ని వ్యక్తం చేశారు

# పిల్లల ఈత సరదా తల్లిదండ్రులకు తీరని దుఃఖాన్ని మిగల్చవద్దు

-పిల్లలను ఒంటరిగా ఈతకు పంపొద్దు
- మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దు.
-మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్.




**మెదక్ జిల్లా -21ఏప్రిల్ (మహాప్రభ )**
వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లలు ఈతకు వెళ్లే విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తత పాటించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచించారు. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే పిల్లల ఈత సరదా ప్రమాదంగా మారే అవకాశముందని హెచ్చరించారు. నీటి లోతు తెలియకపోవడం, జారి పడటం వంటి కారణాలతో చిన్నారులు ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు తరచుగా వెలుగుచూస్తున్నాయని పేర్కొన్నారు. కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయరాదన్నారు. పిల్లలకు ఈత నేర్పించాలని అనుకుంటే తప్పనిసరిగా తల్లిదండ్రులు లేదా పెద్దల పర్యవేక్షణలోనే నేర్పించాలని సూచించారు. గ్రామాల్లోని బావులు, చెరువుల వద్ద భద్రతా నియమాలు కచ్చితంగా పాటించాలన్నారు. ప్రమాదం జరిగక ముందే జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత ముఖ్యమని, పిల్లల సరదా తల్లిదండ్రులకు జీవితాంతం మిగిలే విషాదంగా మారకూడదని ఎస్పీ పేర్కొన్నారు. అదేవిధంగా మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకున్న ఘటనలను గుర్తు చేస్తూ, అటువంటి చర్యలకు దూరంగా ఉండాలని తల్లిదండ్రులను హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చినట్లు తేలితే తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వేసవి కాలంలో పిల్లలు ఎక్కువ సమయం ఖాళీగా ఉండే పరిస్థితుల్లో, వారిని ఇంట్లోనే ఉంచి చదువు, క్రీడలు లేదా ఇతర సృజనాత్మక కార్యకలాపాల వైపు దారి చూపాలని ఎస్పీ సూచించారు. పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు, గ్రామస్తులు అందరూ సమిష్టిగా బాధ్యత వహించాలని కోరారు.

# ప్యాడీ కొనుగోలు కేంద్రాల పరిశీలన చెల్లింపులు వేగవంతం చేయాలని ఆదేశం



**కామారెడ్డి, ఏప్రిల్ 21 (మహాప్రభ)**
తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లైస్ ప్రధాన కార్యదర్శి ఢ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఐపీఎస్ మంగళవారం కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామంలోని ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ సెంటర్ (ప్యాక్స్), గోకుల్ తాండా పీపీసీ (ఐకేపీ)లను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన ఆయన కొనుగోలు కేంద్రాల పనితీరును సమీక్షించారు. ప్యాడీ కొనుగోలులో భాగంగా పని చేస్తున్న అన్ని శాఖల అధికారులతో సమావేశమై కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా చూడాలని, ఓపీఎంఎస్ టాబ్లెట్లలో నమోదులను సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 35,300 మెట్రిక్ టన్నుల ప్యాడీ కొనుగోలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్, జిల్లా సివిల్ సప్లైస్ అధికారి, డీఎం (సివిల్ సప్లైస్), డీఆర్‌డీవో, డీసీఓ, డీఎల్‌ఎంఓ, ఏడి, (మార్కెటింగ్)తో పాటు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**తెలంగాణలో పారదర్శక జనగననే లక్ష్యంగా**

# పటిష్ట చర్యలు తెలంగాణ


**తెలంగాణలో జనాభా లెక్కల ప్రక్రియపై చురుకుగా పర్యవేక్షణ**
**రాష్ట్ర సెన్సస్ (జనగణన) డైరెక్టర్ భారతి హోళికేరి**



**మెదక్ జిల్లా -21ఏప్రిల్ (మహాప్రభ )**
చేగుంట మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్లో జరుగుతున్న ఎన్యుమరేటర్లకు ,సూపర్వైజర్లకు శిక్షణ కార్యక్రమ ముగింపు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనగణన డైరెక్టర్ భారతి హోళీ కేరి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణన మొదటి విడత మే 11 నుంచి జూన్ 9 వరకు నిర్వహించడం జరుగుతుందని, జిల్లా రాష్ట్ర జాతీయ స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేసామన్నారు. ఎన్యుమరేటర్లు ,సూపర్వైజర్లు క్షేత్రస్థాయిలోకి వెళ్లి 33 రకాల ప్రశ్నలకు సమాధానాలు రాబట్టాలని తెలిపారు. పకడ్బందీగా జన గణన చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జై చంద్ర రెడ్డి, స్థానిక తహసిల్దార్, అధికారులు పాల్గొన్నారు.

# కొడుకుతో కలిసి భర్తను హత్య చేసిన భార్య...

**పాపన్నపేట ఏప్రిల్21( మహాప్రభ)**
కుటుంబ కలహాలతో భార్య కొడుకుతో కలిసి భర్తను హత్య చేసిన సంఘటన మండల పరిధిలోని పొడ్చన్ పల్లి తండాలో చోటు చేసుకుంది. ఏఎస్సై తుక్కయ్య కథనం ప్రకారం వివరాలు...పొడ్చన్ పల్లి తండాకు చెందిన మాలోత్ కిషన్(60) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తరచూ మద్యం సేవించి ఇంటికి వస్తున్నాడు. మద్యం మత్తులో తరచూ ఇంట్లో గొడవలు చోటు చేసుకుంటున్నాయి. సోమవారం రాత్రి సమయంలో కిషన్ మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఉన్న భార్య మాలి, కొడుకు వినోద్ తో గొడవ చోటు చేసుకుంది. కిషన్ ను అంతమోదిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదని భార్య మాలి, కొడుకు వినోద్ లు ఈ క్రమంలో భార్య మాలి,




కొడుకు వినోద్ లు కిషన్ ను కింద పడేసి చేతులతో బాగా కొట్టారు. మాలి కిషన్ కాళ్లు గట్టిగా పట్టుకోగా వినోద్ కిషన్ గొంతు నొక్కి హత్య చేసి ఇంటి ముందున్న నీటి తొట్టిలో పడేశారు. కొంత సేపటికి అటుగా వెళ్లిన స్థానికులు నీటి తొట్టిలో పడి ఉన్న కిషన్ ను గమనించి బంధువులకు, పోలీసులకు సమాచారం అందించారు. కిషన్ మృతి పట్ల అనుమానం రావడంతో మాలి, వినోద్ లను నిలదీయగా హత్య చేసిన విషయం తెలిసింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా హాస్పిటల్ కు తరలించారు. మృతుడి కూతురు లీలావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

# బిజినెస్

## సింగిల్ చార్జింగ్‌తో 792 కిలోమీటర్లు..

సీ-క్లాస్‌ను ప్రవేశపెట్టిన మెర్సిడెజ్




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21**

జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్...దేశీయ మార్కెట్‌కు మరో ఈవీని పరిచయం చేసింది. సింగిల్ చార్జింగ్‌తో 762 కిలోమీటర్లు ప్రయాణించనున్న ఈ సరికొత్త ఈవీని సీ-క్లాస్ వెర్షన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.రెండు ఎలక్ట్రిక్ మోటర్స్‌తో తయారైన ఈ వాహనంలో 360 కిలోవాట్ల బ్యాటరీ కలిగివున్నది. అలాగే కేవలం 3.9 సెకండ్లలో 97 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు సింగిల్ చార్జింగ్‌తో 750 కిలోమీటర్లకు పైగా ప్రయాణించనున్నదని కంపెనీ వర్గాలు వెల్లడించారు. బీఎండబ్ల్యూ ఐ3 సింగిల్ చార్జింగ్‌తో 900 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. దీని తర్వాత అత్యధిక మైలేజీ ఇచ్చే కారు ఇదే కావడం విశేషం. దేశవ్యాప్తంగా లగ్జరీ ఈవీలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ నయా ఈవీని తీసుకొచ్చినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ధర వివరాలు వెల్లడించలేదు

## వరుసగా మూడో సెషన్‌లో లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్‌లు


అంతర్జాతీయంగా ఉన్న సానుకూల సంకేతాలవల్ల భారత స్టాక్ మార్కెట్లు (ాశీఃఝ ఝఱతీఎవ్ం) వరుసగా మూడో రోజూ లాభాల్లో ముగిశాయి. అమెరికా , ఇరాన్ మధ్య జరగనున్న చర్చల్లో కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించవచ్చనే ఆశలతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడింది. ఫలితంగా మంగళవారం ట్రేడింగ్‌లో సూచీలు భారీ లాభాలను నమోదు చేశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్‌ఈ సెన్సెక్స్ 753.03 పాయింట్లు లాభపడి 79,273.33 వద్ద స్థిరపడింది.అదేవిధంగా ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ కూడా 211.75 పాయింట్లు లాభపడి 24,576.60 వద్ద ముగిసింది. నెస్లే ఇండియా, ట్రెంట్, హిందుస్తాన్ యూనిలీవర్ వంటి హెవీవెయిట్ షేర్లలో కొనుగోళ్లు సూచీల పెరుగుదలకు దోహదపడ్డాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ సానుకూల వాతావరణం కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.49 శాతం, స్మాల్‌క్యాప్ 0.88 శాతం మేర లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ



ఎఫ్ఎంసీజీ, రియల్టీ సూచీలు మంచి పనితీరు కనబరచగా నిఫ్టీ ఫార్మా వెనుకబడింది. సాంకేతికంగా నిఫ్టీకి 24,600 స్థాయి వద్ద తక్షణ నిరోధం ఎదురవుతోందని, దానిని దాటితే 24,850, ఆపై 25,000 స్థాయిలకు చేరవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. కింది స్థాయిలో 24,350--24,400 శ్రేణి తక్షణ మద్దతుగా పనిచేస్తుందని తెలిపారు.

## దిగి వస్తున్న బంగారం, వెండి ధరలు..

గత రెండు, మూడు రోజుల నుంచి బంగారం, వెండి ధరలు భారీగా తగ్గాయి. అమెరికా డాలర్ బలపడటం, పశ్చిమాసియాలో అనిశ్చితి పెరగడం వంటి కారణాలతో ఇన్వెస్టర్లు జాగ్రత్త వహించారు. కామెక్స్ లో బంగారం ధర రూ. 1.21శాతం తగ్గి ఔన్సుకు 4, 821 డాలర్లకు చేరింది. వెండి ధర రూ. 2.05శాతం తగ్గి ఔన్సుకు 80.16 డాలర్లకు చేరుకుంది. అయితే మంగళవారం ధరలను పరిశీలిస్తే దేశీయంగా బంగారం, వెండి ధరలు దిగి వచ్చాయి.ఇటీవల బంగారం ధరలు భారీగా పెరిగినప్పటికీ.. అక్షయ తృతీయ రోజున కొనుగోళ్లు భారీగా జరిగాయి. ఇండియా బులియన్ అసోసియేషన్ ప్రకారం, 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 1,55,280కు చేరుకుంది. అదేవిధంగా, 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 1,42,340కు చేరింది. 999శాతం స్వచ్ఛమైన వెండి ధర కిలోగ్రాముకు రూ. 2,74,90కి చేరింది. అక్షయ



తృతీయ రోజున షాపులన్ని మహిళలతో కిటకిటలాడాయి. కొనుగోళ్లు కూడా భారీగా జరిగినట్లు బులియన్ మార్కెట్ వ్యాపారులు చెబుతున్నారు.ఇక హైదరాబాద్‌లో ఏప్రిల్ 21వ తేదీన 24 క్యారెట్ల బంగారం (ప్యూర్ గోల్డ్): రూ.1,55,280 అదే 22 క్యారెట్ల బంగారం (ఆర్నమెంట్ గోల్డ్): రూ.1,42,340, 18 క్యారెట్ల బంగారం: రూ.1,16,460, ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం (ప్యూర్ గోల్డ్): రూ.1,55,430 అదే 22 క్యారెట్ల బంగారం (ఆర్నమెంట్ గోల్డ్): రూ.1,42,490 వద్ద కొనసాగుతోంది. గత కొన్ని రోజులుగా బంగారం ధరలలో కీలక మార్పులు చోటు చేసుకుంటున్నాయి.ముంబైలో 24 క్యారెట్ల బంగారం (ప్యూర్ గోల్డ్): రూ.1,55,280 అదే 22 క్యారెట్ల బంగారం (ఆర్నమెంట్ గోల్డ్): రూ.1,42,340 వద్ద ఉండగా, అదే చెన్నైలో 24 క్యారెట్ల బంగారం (ప్యూర్ గోల్డ్): రూ.1,55,990 అదే 22 క్యారెట్ల బంగారం (ఆర్నమెంట్ గోల్డ్): రూ.1,42,990ఇక వెండి విషయానికొస్తే హైదరాబాద్, చెన్నై, కేరళ రాష్ట్రాల్లో అయితే కిలో వెండి ధర రూ.2,79,900 వద్ద కొనసాగుతుండగా, అదే ఢిల్లీ, ముంబై, బెంగళూరుతో పాటు ఇతర నగరాల్లో కిలో వెండి ధర రూ.2,74,900 వద్ద ట్రేడవుతోంది. గతంలో కిలో వెండి ధర ఏకంగా 4 లక్షల రూపాయల వరకు వెళ్లిగా ప్రస్తుతం చూస్తే భారీగా తగ్గిపోయింది. దాదాపు లక్ష రూపాయలకుపైగానే పడిపోయింది.

# స్పోర్ట్స్

## చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు భారీ ఎదురుదెబ్బ

ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ సీజన్‌లో నిలకడగా రాణిస్తున్న యువ బ్యాటర్ ఆయుష్ మాత్ర గాయం కారణంగా ఐపీఎల్ 2026 మొత్తానికి దూరమయ్యాడు. ఈ విషయాన్ని ఫ్రాంచైజీ అధికారికంగా ధృవీకరించడంతో సీఎస్‌కే అభిమానులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. టోర్నీ కీలక దశకు చేరుకుంటున్న తరుణంలో ఇది జట్టుకు పెద్ద లోటుగా మారింది.ఏప్రిల్ 18న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో ఆయుష్ మాత్రే బ్యాటింగ్ చేస్తుండగా కండరాల గాయానికి (హ్యామ్‌స్ట్రింగ్) గురయ్యాడు. క్రీజులో పరుగు తీస్తున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిన ఆయుష్, నొప్పితో విలవిలలాడుతూ మైదానాన్ని వీడాల్సి వచ్చింది. ప్రాథమిక చికిత్స అనంతరం పరీక్షలు నిర్వహించిన వైద్యులు, గాయం తీవ్రత ఎక్కువగా ఉందని తేల్చారు. చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యం తమ సామాజిక మాధ్యమ వేదిక ద్వారా ఈ విషయాన్ని వెల్లడించింది. "ఆయుష్ మాత్రే ఎడమ కాలు



కండరాల గాయం కారణంగా ఈ సీజన్ నుంచి తప్పుకుంటున్నాడు. అతను కోలుకోవడానికి కనీసం 6 నుంచి 12 వారాల సమయం పడుతుంది. ఈ క్లిష్ట సమయంలో అతనికి అండగా ఉంటాం, ఆయుష్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాం" అని జట్టు యాజమాన్యం పేర్కొంది.ప్రస్తుత సీజన్‌లో రుతురాజ్ గైక్వాడ్, సంజూ శామ్సన్ ఓపెనర్లుగా వస్తుండగా, మూడో స్థానంలో ఆయుష్ మాత్రే నమ్మదగ్గ ఆటగాడిగా ఎదిగాడు. కీలక సమయాల్లో ఇన్నింగ్స్‌ను నిర్మించడంలో అతను పోషించిన పాత్ర అమోఘం. ఇప్పుడు అతను అందుబాటులో లేకపోవడంతో, ఆ స్థానాన్ని భర్తీ చేసే సరైన ఆటగాడి కోసం కెప్టెన్, కోచింగ్ బృందం అన్వేషిస్తోంది. మిడిల్ ఆర్డర్‌లో అనుభవజ్ఞులైన ఆటగాళ్లపై ఇప్పుడు అదనపు భారం పడనుంది. ఆయుష్ స్థానంలో కొత్త ఆటగాడిని తీసుకునే అవకాశంపై సీఎస్‌కే ఇంకా స్పష్టత ఇవ్వలేదు. రీహాబిలిటేషన్ ప్రక్రియ పూర్తి కావడానికి సుమారు మూడు నెలలు పట్టే అవకాశం ఉండటంతో, అతను వచ్చే దేశవాళీ సీజన్ నాటికి సిద్ధమవుతాడని భావిస్తున్నారు. ప్లేఆఫ్స్ రేసులో ఉన్న చెన్నై జట్టుకు, ఈ మార్పులు ఏ మేరకు కలిసి వస్తాయో వేచి చూడాలి.

## ప్రఫుల్ హింగేపై సన్‌రైజర్స్ హైదరాబాద్ వేటు




వరుసగా రెండు మ్యాచ్‌లు గెలిపించిన యువ పేసర్ ప్రఫుల్ హింగేపై సన్‌రైజర్స్ హైదరాబాద్ వేటు వేసింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో ఉప్పల్ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో రెండు మార్పులతో బరిలోకి దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. ప్రఫుల్ హింగే, లివింగ్ స్టోన్‌లను తుది జట్టు నుంచి తప్పించి ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్ లిస్ట్‌లో చేర్చింది.పిచ్ స్పిన్ బౌలింగ్‌కు అనుకూలంగా ఉంటుందనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ఇషాన్ కిషన్ తెలిపాడు. ఎక్కువ స్పిన్ ఆప్షన్స్ కోసం ప్రఫుల్ హింగేను పక్కనపెట్టామని చెప్పాడు. దిల్షాన్ మదుషంక తుది జట్టులోకి వచ్చాడని ఇషాన్ కిషన్ తెలిపాడు. అయితే ప్రఫుల్ హింగే, మదుషంకలో ఒకరే ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడుతారని చెప్పాడు.ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. టాస్ సందర్భంగా మాట్లాడిన ఇషాన్ కిషన్.. గత మ్యాచ్‌లతో పోల్చితే ఇది భిన్నమైన వికెట్ అని తెలిపాడు. 'ఈ పిచ్‌పై ఇప్పుడే ఒక నిర్ణయానికి రాలేం. ఎందుకంటే గత కొన్ని మ్యాచ్‌ల్లో మేం ఆడిన వికెట్ లాగా ఇది లేదు. పిచ్ కండిషన్స్ బట్టి ఆడాల్సి ఉంది. ఈ రోజు మా తుది జట్టులో కొన్ని మార్పులు ఉన్నాయి, మధుషంక బరిలోకి దిగుతుండగా.. ప్రఫుల్ హింగే బెంచ్‌కే పరిమితం కానున్నాడు. ఈ విషయంపై నాకు క్లారిటీ లేదు. హర్ష్‌దూబే తిరిగి జట్టులోకి వచ్చాడు. ఎందుకంటే ఇది కొంచెం స్లో ట్రాక్. వికెట్లు తీయడానికి మాకు స్పిన్ ఆప్షన్ ఉండాలని ఈ నిర్ణయం తీసుకున్నాం. మా కుర్రాళ్లు అద్భుతంగా రాణిస్తున్నారు. ఫలితాలను చూసి ఈ మాట చెప్పడం లేదు. మా ప్రణాళికలను వారు అమలు చేస్తున్న విధానం, వారి మనస్థత్వం చూసి ఈ మాట అంటున్నా. మరోవైపు ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నాడు. టాస్ విషయంలో తమకు అదృష్టం కలిసి వస్తుందన్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున 100 మ్యాచ్‌లు ఆడుతానని అనుకోలేదని, ఈ రోజు విజయం దక్కుతుందనే ఆశాభావంతో ఉన్నానని వెల్లడించాడు. తమ తుది జట్టులో ఒక మార్పు చేశామని చెప్పిన అక్షర్ పటేల్.. ఆకిబ్ స్థానంలో నితీష్ రాణా బరిలోకి దిగుతున్నాడని తెలిపాడు.

## చాహల్ వద్దు.. కోహ్లీ లాంటోడు కావాలి

**బిగ్‌బాస్ 13 ఫేమ్, ప్రముఖ స్పోర్ట్స్ యాంకర్ షెఫాలీ బగ్గా**

టీమిండియా వెటరన్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్‌తో తాను డేటింగ్ చేస్తున్నట్లు వచ్చిన వార్తలను బిగ్‌బాస్ 13 ఫేమ్, ప్రముఖ స్పోర్ట్స్ యాంకర్ షెఫాలీ బగ్గా కొట్టిపారేసింది. ఇలాంటి వార్తలతో తాను విసిగిపోయానని అసహనం వ్యక్తం చేసింది. కలిసి డిన్నర్ చేసినంత మాత్రాన డేటింగ్ అంటూ ప్రచారాం చేస్తారా? అని మండిపడింది.యుజ్వేంద్ర చాహల్‌తో కలిసి షెఫాలీ బగ్గా ఉన్న వీడియో ఒకటి వైరల్ కావడంతో ఈ ఇద్దరూ డేటింగ్‌లో ఉన్నారనే పుకార్లు వెలువడ్డాయి. తాజాగా ఈ వార్తలపై స్పందించిన షెఫాలీ బగ్గా.. తనకు చాహల్ వద్దని, కోహ్లీలాంటి అబ్బాయి కావాలని పేర్కొంది. ఇలాంటి చిన్న చూపుతో తాను విసిగిపోయానని పేర్కొంది. వాస్తవం ఏంటో తనకు, తన ఆత్మీయులకు తెలుసు అని పేర్కొంది. తనకు క్రికెటర్లతో డేటింగ్ చేసే ఉద్దేశం లేదని స్పష్టం చేసింది. 'ఇది నా వృత్తి. నా ప్రొఫెషన్, వ్యక్తిగత జీవితాన్ని కలిపే ఉద్దేశం అస్సలు లేదు. అందుకే క్రికెటర్లతో డేటింగ్ చేసే ఆలోచన నాకు లేదు. నాకు విరాట్ కోహ్లీ లాంటి భాగస్వామి కావాలి. అతను



ఎంత బిజీగా ఉన్నా అనుష్క పట్ల చూపించే ప్రేమ, అంకితభావం, ఆరాధన నాకు చాలా ఇష్టం. నా భాగస్వామి నాతో ఉన్నప్పుడు పూర్తిగా నాకే సమయం కేటాయించాలి. నాపైనే పూర్తి శ్రద్ధ పెట్టాలి. నా పార్ట్‌నర్‌కు లగ్జరీల కంటే ప్రేమించే మనసు,నన్ను కేర్ చేసే గుణం ఉంటే చాలు. ప్రస్తుతానికి ప్రేమ, పెళ్లి లాంటి విషయాల కంటే నా కెరీర్‌కే అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాను. 'అని షెఫాలీ బగ్గా చెప్పుకొచ్చింది. ఐపీఎల్ లాంటి ప్రతిష్ఠాత్మక టోర్నీలకు యాంకర్‌గా వ్యవహరిస్తున్న షెఫాలీ.. త్వరలో బాలీవుడ్, సౌత్ ఇండియన్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాల వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటించనుంది.



కుర్రాళ్ళగుండెల్ని కొల్లగొడుతున్న శివాని నాగరం

# ఆకట్టుకుంటున్న 'రాజా శివాజీ' ట్రైలర్

## శివాజీ మహారాజ్‌గా రితేష్ దేశ్‌ముఖ్..

మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ వీరగాథను వెండితెరపై ఆవిష్కరిస్తూ రితేష్ దేశ్‌ముఖ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న "రాజా శివాజీ" చిత్రం ప్రస్తుతం దేశవ్యాప్తంగా సినీ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చారిత్రక చిత్రానికి రితేష్ దేశ్‌ముఖ్ స్వయంగా దర్శకత్వం వహిస్తుండగా, ఆయన భార్య జెనీలియా దేశ్‌ముఖ్ తన సొంత నిర్మాణ సంస్థ ముంబై ఫిల్మ్ కంపెనీ మరియు జియో స్టూడియోస్ భాగస్వామ్యంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా మే 01న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే భారీ విజువల్స్ మరియు పవర్‌ఫుల్ డైలాగ్స్ సినిమాపై భారీ అంచనాలను పెంచేశాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ ఒక కీలకమైన ప్రతినాయక పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. శివాజీ మహారాజ్ స్వరాజ్యం కోసం చేసిన పోరాటాన్ని, ఆయన సాహసాలను ఎంతో గ్రాండ్‌గా చూపించబోతున్న ఈ సినిమాను మరాఠీ మరియు హిందీ భాషల్లో ప్రధానంగా రూపొందించారు. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం మహారాష్ట్ర దినోత్సవం సందర్భంగా 2026 మే 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. గతంలో 'వేద్' వంటి భారీ విజయాలను అందుకున్న రితేష్-జెనీలియా కాంబో ఈ చారిత్రక చిత్రంతో మరోసారి బాక్సాఫీస్ వద్ద తమ సత్తా చాటడానికి సిద్ధమవుతున్నారు




# జూన్ 11న డ్రాగన్ మూవీ విడుదల




ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతోన్న పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రానున్న డ్రాగన్ చిత్రం కొత్త విడుదల తేదీని నిర్మాణ సంస్థ తాజాగా ప్రకటించింది. ఈ సినిమాను వచ్చే ఏడాది జూన్ 11న విడుదల చేయనున్నట్లు తెలిపింది. తుపాను తన లక్ష్యాన్ని కనుగొంది. 2027 జూన్ 11న థియేటర్‌లలో తుపాను రావడం ఖాయం అంటూ కొత్త విడుదల తేదీతో పాటు ఓ అప్‌డేట్‌ను పంచుకుంది. మే 20న ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా గ్లింప్స్ విడుదల చేయనున్నట్లు తెలిపింది. మొదట ఈ సినిమాను ఈ ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలని మేకర్స్ భావించారు. భారీస్థాయిలో ఈ ప్రాజెక్ట్ తెరకెక్కుతుండడంతో దీన్ని ఈయేడాది జూన్ 25కు వాయిదా వేశారు. అయితే ఇంకా షూటింగ్ పూర్తికాకపోవడం.. పోస్ట్ ప్రొడక్షన్ పనులు మిగిలిఉండడంతో ఇప్పుడు వచ్చే ఏడాదికి వాయిదా వేశారు. ప్రశాంత్ నీల్ మేకింగ్ విషయంలో ఎక్కడా రాజీపడకుండా దీన్ని రూపొందిస్తున్నారు. సినిమా ఆలస్యమైనా.. అభిమానులు కోరుకునేలా ఉండేలా చూస్తున్నారు. ఈ చిత్రంలో ఎన్టీఆర్‌కు జోడీగా రుక్మిణీ వసంత్ నటిస్తున్నారు. 'డ్రాగన్' అనే పేరు ప్రచారంలో ఉంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తోన్న ఈ సినిమా కోసం ఎన్టీఆర్ తన లుక్ మార్చుకున్నారు. బరువు తగ్గి నాజూగ్గా కనిపిస్తున్నారు. ఇటీవల తన జిమ్ ఫొటో విడుదల చేయగా అది వైరల్ అయింది. దీంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

# ఎదురుగా పిజ్జా ఉన్నా తినకుండా డైట్..!

## సినిమా కోసం స్ట్రిక్ట్ డైట్ ఫాలో అవుతున్న స్టార్

హోమీ అదాజానియా దర్శకత్వంలో రాబోతున్న 'కాక్‌టెయిల్ 2' ఫస్ట్ లుక్ విడుదలైనప్పటి నుండి సోషల్ మీడియాలో కృతి సనన్ మేకోవర్ గురించే చర్చ జరుగుతోంది. 'కాక్‌టెయిల్' మొదటి భాగంలో దీపికా పదుకొణె పోషించిన ఐకానిక్ 'వెరోనికా' పాత్రను గుర్తుకు తెచ్చేలా కృతి కనిపిస్తోంది. టోన్డ్ బికినీ బాడీ నుండి బోహేమియన్ అవుట్‌ఫిట్స్ వరకు ఆమె వేసుకున్న ప్రతి డ్రెస్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. అయితే, ఈ స్థాయి ఫిట్‌నెస్‌ను సాధించడం వెనుక కృతి పడిన శ్రమ అంతా ఇంతా కాదు. క్యాలరీ డెఫిసిట్ డైట్ సినిమా కోసం కృతి తన జీవితంలో మొదటిసారి 'క్యాలరీ డెఫిసిట్' (తక్కువ క్యాలరీలు తీసుకోవడం) డైట్‌ను అనుసరించింది. విశేషమేమిటంటే, ఈ సినిమా షూటింగ్ ఇటలీలోని సిసిలీలో జరిగింది. ఇటలీ అంటేనే పిజ్జాలు, పాస్తాలకు పెట్టింది పేరు. చుట్టూ నోరూరించే కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండే వంటకాలు ఉన్నప్పటికీ, కృతి తన డైట్ విషయంలో ఏమాత్రం వెనకడుగు వేయలేదు. కేవలం టోన్డ్ లుక్ కోసం, ఒక అథ్లెటిక్ బాడీని సాధించడం కోసం ఆమె ఆ కఠినమైన ఆహార నియమాలను పాటించింది. క్యాలరీ డెఫిసిట్ డైట్ అనేది కేవలం బరువు తగ్గడానికే కాకుండా, శరీరంలోని కొవ్వును తగ్గించి మెటబాలిక్ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఎంతో సహాయపడుతుంది. సైఫ్ అలీ ఖాన్, దీపికా పదుకొణె, డయానా పెంటీ నటించిన 'కాక్‌టెయిల్' అప్పట్లో ఒక ట్రెండ్ సెట్టర్‌గా నిలిచింది. ఇప్పుడు వస్తున్న ఈ సీక్వెల్‌లో కృతి సనన్‌తో పాటు షాహిద్ కపూర్, రష్మిక మందన్న నటిస్తున్నారు. కృతి తన అంకితభావంతో సాధించిన ఈ అద్భుతమైన మార్పు సినిమాపై అంచనాలను పెంచేసింది. వెండితెరపై కృతి సనన్ కొత్త అవతారం ప్రేక్షకులను ఏ విధంగా అలరిస్తుందో చూడాలి. ఈ చిత్రం జూన్ 19, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది. గ్లామర్, ఎమోషన్స్, మంచి మ్యూజిక్ కలగలిసిన ఈ సినిమా కృతి కెరీర్‌లో మరో హిట్ గా నిలుస్తుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. కృతి సనన్ ఫిట్‌నెస్ ప్రయాణం నేటి తరం యువతకు ఒక గొప్ప స్ఫూర్తి అని చెప్పవచ్చు.



# జైలర్-2 షూటింగ్ పార్ట పూర్తి

## కేక్ కట్‌చేసి సెటబ్రేషన్ చేసుకున్న యూనిట్




సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న 'జైలర్ 2' సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రముఖ దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్ గురించి తాజాగా కీలక అప్‌డేట్ వెలువడింది. చిత్ర బృందం అధికారికంగా షూటింగ్ పూర్తయిందని ప్రకటించడంతో, అభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. షూటింగ్ పూర్తయిన సందర్భంగా చిత్ర యూనిట్ రజనీతో కలిసి కేక్ కట్ చేసి సెలబ్రేషన్స్ జరుపుకుంది. ఈ సందర్భంగా బయటకు వచ్చిన ఫోటోలు, వీడియోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలోకి ప్రవేశించింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా పూర్తి చేస్తే, సినిమా అనుకున్న సమయానికి ముందే విడుదలయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు చిత్ర బృందం అధికారిక విడుదల తేదీని ప్రకటించలేదు. దీంతో అభిమానులు రిలీజ్ డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాలో శివ రాజ్‌కుమార్, ఎస్.జే. సూర్య, మోహన్‌లాల్, రమ్య కృష్ణన్, మిర్నా మీనన్, యోగి బాబు వంటి పలువురు ప్రముఖులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భారీ తారాగణంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకులను అలరించనుంది. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా, సంగీతాన్ని అనిరుధ్ రవిచందర్ అందిస్తున్నారు. ఇప్పటికే ఆయన సంగీతం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అభిమానులు భావిస్తున్నారు. అయితే 'జైలర్ 2' షూటింగ్ పూర్తవడంతో, ఇప్పుడు అందరి దృష్టి పోస్ట్ ప్రొడక్షన్ పనులు మరియు రిలీజ్ డేట్‌పై ఉంది. రజనీకాంత్ స్టైల్, నెల్సన్ మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్ కలయికలో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధిస్తుందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# సూర్య బి పాజిటివ్' చిత్ర టీజర్ విడుదల




కాళీ క్రాఫ్ట్స్ మరియు నిర్మలం డ్రామాస్ బ్యానర్లపై సుబ్బా మాధవరపు దర్శకత్వంలో రూపొందిన 'సూర్య బి పాజిటివ్' చిత్ర టీజర్ విడుదల వేడుక హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకులు కౌశిక్ పెగల్లపాటి (కిష్కింధపురి ఫేమ్), మురళీకాంత్ దేవసోత్ (దండోరా ఫేమ్) ముఖ్య అతిథులుగా హాజరై చిత్ర టీజర్‌ను ఆవిష్కరించారు. చరణ్ పీసర్ల హీరోగా నటిస్తూ డైలాగ్స్ రాయడంలోనూ పాలుపంచుకున్న ఈ చిత్రంలో యానీ దయానా, దివ్య విశ్వకర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు. టీజర్ ఆవిష్కరణ అనంతరం ముఖ్య అతిథిగా వచ్చిన మురళీకాంత్ దేవసోత్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో ఒక సినిమాను నిర్మించడం ఎంత కష్టమో తనకు తెలుసని, అమెరికాలో ఉద్యోగం చేస్తూనే సుబ్బా మాధవరపు ఇక్కడికి వచ్చి పట్టుదలతో ఈ సినిమాను పూర్తి చేయడం అభినందనీయమని కొనియాడారు. టీజర్‌లోని విజువల్స్, నటీనటుల ప్రతిభ సినిమాపై ఆసక్తిని కలిగిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. మరో అతిథి కౌశిక్ పెగల్లపాటి మాట్లాడుతూ, చరణ్ తనకు కాలేజీ జూనియర్ అని, హీరోగా గుర్తింపు తెచ్చుకోవాలనే తపన అతనిలో బలంగా ఉందని అన్నారు. టీజర్ ఎడిటింగ్ స్టైల్ చాలా ప్రత్యేకంగా ఉందని, ఒక సామాన్యుడి కథను వెండితెరపై ఆవిష్కరిస్తున్న తీరు ప్రేక్షకులను మెప్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హీరో చరణ్ పీసర్ల తన ప్రసంగంలో ఉద్వేగానికి లోనయ్యారు. గతంలో మూడు సినిమాలు చేసినా అవి విడుదల కాలేదని, ఈ నాలుగవ ప్రయత్నం ద్వారా నటుడిగా ప్రేక్షకుల నుంచి అర్హతను ఆశిస్తున్నానని తెలిపారు. నటి సుజాత దీక్షిత్ మాట్లాడుతూ, తన నిజస్వరూపానికి భిన్నంగా ఈ చిత్రంలో నిశ్శబ్దంగా ఉంటూ కళ్ళతో పలికించే పాత్రను దర్శకుడు తనతో చేయించారని తెలిపారు. హీరోయిన్లు యానీ దయానా, దివ్య విశ్వకర్మ తమకు తెలుగు రాకపోయినా చిత్ర బృందం ఎంతో సహకరించిందని, ఇదొక మంచి అనుభూతిని ఇచ్చిందని అన్నారు. బలగం సత్య, లిరిసిస్ట్ రాంబాబు గోసాల కూడా చిత్ర విజయానికి తమ ఆకాంక్షలను తెలియజేశారు. త్వరలోనే ఈ చిత్రం థియేటర్లలో ప్రేక్షకులను పలకరించనుంది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com